తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక
23వ నవ్వుల వసంతం

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాసపత్రిక ఆగష్టు-2025 ₹25

విఘ్నాలే తొలగాలని...
విజయాలే కలగాలని...
నవ్వుల నాయకుని
విన్నవించుకుందాం!
హాస్యానందంగా
ఉందాం!





బాచి పురస్కారం-2025
కార్టూన్ పోటీ ఫలితాలు

సోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక
కార్టూన్ పోటీ ఫలితాలు




డా॥ కె.వి.రమణాచారి గారు
టి.టి.డి. ఈవో గా పని చేసిన
కాలంలో ఆయనకు ఎదురయిన
పరీక్షలు... విజయాలు...
అన్నీ అద్భుతాలే!
ఆ అద్భుతాల సమాహారం




ప్రతులకు సంప్రదించండి-
సాహితీ ప్రచురణలు, 33-22-2, చంద్ర బిల్డింగ్స్,
సి.ఆర్. రోడ్డు, చుట్టగుంట, విజయవాడ-520 004
ఫోన్: 0866 2436643

వెల: 150 రూపాయలు

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

# హాస్యానందం


ఆగస్టు-2025

23వ సంవత్సరం
254 వ సంచిక

ముఖచిత్రం: నవ్వుల నాయకుడు

**Publisher& Editor-**
**Ramu.P**

| సంవత్సర చందా- రూ.300/- | 2 సంవత్సరాల చందా- రూ.600/- |
|---|---|

(పోస్టల్ చార్జీలు ఉచితం)

**జీవిత చందా- రూ.5000/-లు**

Gpay *or* Ppay # **9849630637**

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*Full Pillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*

Dr. K.Ramakrishna, Jaydev, Sarasi,
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar, Krishna
GopalKrishna, Gandhi, Nagisetty,
Venkat, Bomman, Dayakar, Sangram,

*D.T.P:* P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:* Surya

*Well Wishers:*

Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Akshagna Vidya Venkat
Dr.V.V.Rama Kumar

*Prize Sponsers*

K.V.V.Satyanarayana
Akshagna Publications
*Cartonist* JSR
K.Sundaresayya & Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Srikanth Sarma
Cart. RamPrasad

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga, **Risingsun News Agency**
Shop# 5-4-25/b-8, Farman wadi, Abids,
Agarwala Sweets lane, Hyderabad -500001.
Mobile# 9666680857, 6301072906.






*Smile In Every Page... Satisfaction in Every Smile*

# ఎక్కడెక్కడ ఏమున్నాయి?...














**కథలు**

| | | |
|---|---|---|
| థంబ్ నెయిల్స్ చూతము రారండి! | -కండ్లకుంట శరత్ చంద్ర | -14 |
| కొత్త వ్రతం | -మాధవి బైటారు | -32 |
| అదీ కథ! | -ఆర్.సి.కృష్ణస్వామి రాజు | -38 |
| తను, ఆమె, ఒక ప్రయాణం | - డాక్టర్ షహనాజ్ బతుల్ | -42 |
| దొందూ దొందే... | - సుస్మితా రమణమూర్తి | -48 |

**శీర్షికలు**

| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| స్మైల్‌స్టార్స్ | -భగవాన్ | -26 |
| వెనక్కి వెళ్ళే కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -36 |
| వాక్చిత్రం | -సుధామ | -40 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -46 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |

**సీరియల్**

| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -10 |
| సినిమా తీద్దామా? | -గొలుసు సీరియల్ | -28 |

**ప్రత్యేకం**

| | |
|---|---|
| బాచి అవార్డు-2025 కార్టూన్ పోటీ ఫలితాలు | 20 |
| సోమయాజుల శివరామయ్య హైమవతి స్మారక కార్టూన్ పోటీ-2025 ఫలితాలు | 23 |
| గీతల పాత బంగారం | 25 |
| ఇండియన్ ఇంక్ | 34 |

**కార్టూన్ శీర్షికలు**



| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -12 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -13 |
| పంచ్ ఫ్రేమ్ | -కృష్ణ | -31 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -44 |


**ఈ సంచికలో కార్టూనిస్ట్‌లు**

- జయదేవ్
- సరసి
- గాంధి
- బొమ్మన్
- భగవాన్
- కృష్ణ
- టి.ఆర్.బాబు
- పద్మ
- నాగ్రాజ్
- ప్రసిద్ధ
- సాయికృష్ణ
- దాసరి
- శిరి
- శేషిరెడ్డి
- శర్మ
- చక్రవర్తి
- సురేష్
- ఓంకార్
- మోహన్ కుమార్
- తోపల్లి ఆనంద్
- వాడ్రేవు
- హరి
- అరుణ్
- శేఖర్
- నాగిశెట్టి
- గోపాలకృష్ణ
- దొరశ్రీ
- బీవీఎస్
- ఆనంద్‌గుడి
- పైడిశ్రీనివాస్
- ఆయుషి
- ఎన్.ధీరజ
- సునీల్
- జేఎన్నెమ్
- శేఖర్‌బాబు
- భాను
- అప్పాజీకృష్ణ
- బన్ను
- ఆదినారాయణ
- డి.వి.ప్రసాద్
- టి.భాస్కర్
- కాశ్యప్
- వర్మ
- క్రిష్
- ఎమ్.రాము
- శ్రీ
- సాయిరామ్
- అత్తలూరి
- శ్రీనివాస్
- అర్జున్
- షేక్ సుభాని
- రాగతి రమ

**గమనిక:**

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు...**
**సన్నిహితులకు వినాయక చవితి శుభాకాంక్షలు!**

**మ**న జీవితంలో వింత వింత మనస్తత్వాలు గల ఎంతోమందిని చూస్తుంటాము. వారి ప్రవర్తన పట్ల బాధ పడ్తుంటాము కూడా... అయినా వారిని భరించక తప్పని పరిస్థితులు ఉంటాయి. అలాంటి వాళ్ళలో ఒక రకం 'వంకలు' పెట్టే వంకరగాళ్ళు! మనం ఎంత సిన్సియర్‌గా పనులు చేసినా దానికి వంకలు పెడ్తూ ఇంకేదో చేయాలని 'ఉచిత' సలహాలిస్తూ... మనం చేసిన ఆ పనిని గుర్తించక పోగా నిరుత్సాహ పరుస్తారు. అయితే ఇందులో ఒక రకం మన బెటర్‌మెంట్ కోసం చెప్పటం... అంటే ఇంకా 'ఇలా' చేస్తే బాగుంటుందనో...అలా చేయకుండా ఉండాల్సిందనో చెప్తారు. వాళ్ళ 'ఉద్దేశం' ఏమిటనేది మనకు తెలుస్తూనే ఉంటుంది. ఒక పనికి ఒక 'గమ్యం' ఉంటుంది... అది ఎక్కడ ఆపాలో మన విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. మరోవ్యక్తి వారి విచక్షణ బట్టి ఇంకోలా సలహాలిస్తారు. అవి మనకు సరిపోతాయా లేదా అనేది మనం మాత్రమే నిర్ణయించుకోవలసిన అంశం! మనం ఏదైనా పని చేస్తే నలుగురికి చెప్పాలని, చూపించాలని తాపత్రయ పడతాము. వాళ్ళలో ఎక్కువ మంది కచ్చితంగా సలహాలిస్తారు. 'ఆ' మాత్రం పని చేసిన మనకు మంచి ఏదో చెడు ఏదో తెలియదా? నలభై ఏళ్ళ అనుభవం గల డ్రైవర్‌కు స్టీరింగ్ ఎలా పట్టుకోవాలో మనం చెప్పాలా? అనుభవం నేర్పిన పాఠాలు ఎన్నో ఉంటాయి కదా? అడిగాము కదా అని 'పెద్దరికం' తీసుకునే వారి పట్ల మనం కాస్త జాగ్రత్తగా ఉండటం ఎంతైనా అవసరం! మనం చేసిన, చేస్తున్న పనుల పట్ల మనకు ఒక అవగాహన, భావోద్వేగ భావాలు ఉంటాయి... వాటి గురించి విశ్లేషించి మంచి, చెడులు చెప్పే వారి మాటలకు విలువిద్దాం... గౌరవిద్దాం! ఎవరైనా బొమ్మలు వేస్తే బాపు బొమ్మలా లేదంటే ఎలా చెప్పండీ? అది బాగుందా లేదా అనేదే పాయింట్! మనం చేసే పనులు చిత్తశుద్ధితో మన స్థాయికి తగ్గట్లు చేసి మానసిక ఆనందాన్ని పొందుదాం!
ఆ 'వంకర' గాళ్ళకు దూరంగా ఉందాం... దూరంగా ఉంచుదాం!
అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని
కోరుకుంటూ...



# రీ సౌండ్!




✦ **వి.రాజేశ్వరి, ముంబై**

**జూలై** హాస్యానందం సంచికలో ప్రచురించిన ముళ్ళపూడి కథల పోటీలో బహుమతి పొందిన కథలు అన్నీ బావున్నాయి. వివిధ ఇతివృత్తాలతో ఉన్న కథలన్నీ హాస్య కథలు ఎలా ఉండాలో ఋజువు చేసాననడంలో ఏమాత్రం సందేహం లేదు. ఇంత మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీ ఎ.వి.కృష్ణమూర్తిగారికి అభినందనలు.

✦ **ఆర్.బాలాజీ, విజయవాడ**

ప్రయారిటీ గురించి సంపాదకులు రాముగారి 'హాయ్ సానందంగా' లో విశ్లేషించిన విషయాలు అక్షర సత్యాలు. ఎవరు మన పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలా ఎదుటివాళ్ళను 'లెక్క'లేని తనాన్ని ప్రదర్శించేది, మనం అనుకుంటున్న ప్రముఖులన్నదే నా అభిప్రాయం. ఇది అందరూ గమనించి వాళ్ళకూ మనం అంత ప్రధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు! (కొన్ని నా అనుభవాలు వలన ఈ వ్యాసం నన్ను ఆకట్టుకుంది)

✦ **పి.శ్రీవాణి, విశాఖపట్టణం**

**మా** ఆనందాలకి ఒక మంచి వేదిక. మా పిల్లలతో సహా మేమందరం వంద శాతం ఇష్టపడే పత్రిక హాస్యానందం! మంచి మంచి కథలతో, కార్టూన్లతో వెలువడుతున్న ఈ పత్రికకి మేము చందాదారులైనందుకు గర్వపడుతున్నాం!

✦ **బి.వి.అనూరాధ, ముంబై**

**మా** కమ్యూనిటీలో హాస్యానందానికి పది మంది చేత చందా కట్టించాను నేను. అంత ఇష్టం నాకు ఈ పత్రిక! మీ కృషి, సమయపాలన, విషయ సేకరణ పట్ల మీరు తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయం! ఐదవ పేజీలో మీరు ఇస్తున్న జీవిత సత్యాలు అన్నీ కూడా ఆచరణీయం! ఆనందం ఎక్కడో ఉండదు మన చేతుల్లోనే.... చేతల్లోనే అనే విషయం చాల స్పష్టంగా, క్లుప్తంగా చెప్తున్న తీరు బావుంటున్నాయి. పత్రిక కలకాలం వర్ధిల్లాలని మా ఆకాంక్ష!

# ఆహ్వానము

## బాచి అవార్డు &
## శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీల్లో
## విజేతలకు బహుమతి ప్రదాన సభ

**శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక అవార్డు-2025 ప్రదానం**

అవార్డు గ్రహీత-
ప్రముఖ కార్టూనిస్ట్
**శ్రీ అరుణ్**



**పుస్తక ఆవిష్కరణలు**

ప్రముఖ కార్టూనిస్టులు
**శ్రీ సరసి, శ్రీ బాచి, శ్రీ పద్మదాస్**
**కార్టూను పుస్తకాలు**
**ఆవిష్కరణ!**



**ఆగష్టు,15 వ తేదీ, శుక్రవారం, సాయంకాలం 6గంటలకు.**

**విజయవాడ బందరురోడ్డులో రాఘవయ్య పార్క్ ఎదురుగా ఉన్న 'బాలోత్సవ భవన్‌లో'**

హాస్యానందం సౌజన్యంతో నిర్వహిస్తున్న
ఈ కార్టూన్ పోటీలను విజయవంతం చేయాలని మనవి!







| శ్రీ తోరహతుల వెంకటరత్నం,శ్రీమతి వనజాక్షమ్మ దంపతుల స్మారక పురస్కారం-2025 | | శ్రీ తోరహతుల నాగేశ్వరరావు స్మారక పురస్కారం-2025 |
|---|---|---|
| (వారి జ్ఞాపకార్థం వారి కుమారుడు,కోడలు అందిస్తున్నారు) | | (వారి జ్ఞాపకార్థం వారి తమ్ముడు,మరదలు అందిస్తున్నారు) |
| నగదు బహుమతి-5,116/-<br>జ్ఞాపిక+ ప్రశంసాపత్రం<br>10 ప్రత్యేక బహుమతులు<br>నగదు బహుమతి-1,116/-<br>ప్రశంసాపత్రం | గమనిక:<br>✦ కార్టూనిస్టు 3 కార్టూన్లు పంపవచ్చును.<br>✦ అసభ్యకరమైన కార్టూన్లు నిషేధం!<br>✦ క్యాప్షన్ ఏకవాక్యంలో ఉండాలి.<br>✦ విడివిడిగా ఎంట్రీలు పంపాలి.<br>✦ తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. వాదోపవాదాలకు తావు లేదు. | నగదు బహుమతి-5,116/-<br>జ్ఞాపిక+ ప్రశంసాపత్రం<br>10 ప్రత్యేక బహుమతులు<br>నగదు బహుమతి-1,116/-<br>ప్రశంసాపత్రం |

కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ:
ఆగష్టు10, 2025

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-
hasyanandampoteelu@gmail.com

ఫలితాలు సెప్టెంబర్,2025 హాస్యానందంలో ప్రచురించబడతాయి!



# పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక
# దసరా కార్టూన్ పోటీ

'జ్యోతిష విశారద' శ్రీ పాలపర్తి శ్రీకాంత్ శర్మ వారి తల్లిదండ్రుల స్మారకార్థం
ఈ పోటీ నిర్వహిస్తున్నారు.



## సైలెంట్ స్మైల్
కాప్షన్‌లెస్ కార్టూన్ పోటీ

ఒక్కో కార్టూన్ కి 1000 రూపాయలు
చొప్పున10 బహుమతులు

బహుమతి పొందిన కార్టూన్లతో పాటు
బాగున్న కార్టూన్లు అక్టోబర్ సంచికలో ప్రచురిస్తాం!

ఈ కాప్షన్‌లెస్ కార్టూన్ పోటీలో కార్టూన్లు సులభంగా
అర్థమయి నవ్వొచ్చే వాటికే మొదటి ప్రాధాన్యత!

కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ: సెప్టెంబర్-05, 2025

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-
hasyanandampoteelu@gmail.com


## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు


**4500 రూపాయల బహుమతులు**

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.











**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు) రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**
కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమతిగా **1000 రూపాయలు ఇస్తున్నారు.**


మొదటి బహుమతి- **రూ.500/-లు**
రెండవ బహుమతి- **రూ.300/-లు**
మూడవ బహుమతి- **రూ.200/-లు**




**అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారు**
**ఒకో కార్టూన్‌కి రూ.500/-లు**
**చొప్పున ఈ రెండు కార్టూన్లకు**
**1000 రూపాయలు**
బహుమతి ఇస్తున్నారు.


AKSHAGNA PUBLICATIONS





**శ్రీ కుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.




కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**ప్రతి నెలా బహుమతులే!**

ప్రతి నెలా హాస్యానందంకు
వచ్చే కార్టూన్లలోంచి
**8 మంచి కార్టూన్లకు బహుమతులు**
ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు!



కథ-కథనం

**యండమూరి వీరేంద్రనాథ్**

**యర్రంశెట్టి శాయి**





# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగపిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండోవాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. ఒకరోజు సాత్వికరావు ఆత్మహత్య ప్రయత్నంలో బతికిపోయి...లలిత దగ్గరకు చేరతాడు. **ఆ తర్వాత...**

**మంచం మీద తనని పడుకోబెట్టి ఆమె పక్కనే పడుకునేసరికి సాత్వికరావు కంగారు పడి లేచి కూర్చున్నాడు.**

**"అయ్యో! మళ్ళీ లేచారేమిటి?"**

**"అబ్బే! ఏమీలేదు..."**

**లలిత అతన్ని కిందికి లాగి కాళ్ళ మీద కాళ్ళు వేసింది. సాత్వికరావుకి ఊపిరందటం లేదు. తొలి అనుభవం. శరీరమంతా వేడెక్కి పోతోంటే మనసు తడి అవుతోన్న ఫీలింగ్. లలిత అతని మీదకు వంగి, చెవిలో రహస్యంగా "ఇవాళ మన పెళ్ళి రోజన్న విషయం మర్చిపోయారా?" అంది.**

ఆమె తలలోని మల్లెపూలు అతనిని మత్తెక్కించేస్తున్నాయి.

రాధ గుర్తొచ్చింది.

రాధ జలపాతం... ఈవిడ గోదారి.

రాధ పిల్ల కాలువ... ఈవిడ సముద్రం.

రాధ కొండ... ఈవిడ లోయ.

'ఓరి దేవుడా! ఇదేదో మిస్టేకెన్ ఐడెంటిటీ లాగుంది. ఇవాళ కాకపోతే రేపైనా ఈవిడ అసలు మొగుడొస్తాడు. అప్పుడు నిజం బయట పడుతుంది. ఒకవేళ మొగుడు రాకపోయినా, ఏదోలా తను ఈవిడ మొగుడు కాదని తెలుస్తుంది. అప్పుడు తన్ని తగలేస్తారు. అలా గెంటి వేయబడటం తనకి సంతోషమే. హ్యాపీగా వెళ్ళిపోతాడు.

కానీ, తను వెళ్ళిన మూడు నెలల తర్వాత ఈమె పరిమాణం పెరిగి, జీవపరిణామంలో ఏదైనా మార్పు వస్తే పాపం ఆవిడ సంసారం జం జమాజం అవుతుంది. మరో వైపు ఇన్నాళ్ళూ కాపాడుకుంటూ వచ్చిన తన నైతిక విలువల కోట బ్రద్దలై పోతుంది. ఏదో ఉపాయం ఆలోచించి ఈ బెడద నుంచి తప్పించు కోవాలి!' అనుకుంటూ ఆమె కౌగిలి బలవంతంగా విడిపించుకొని...

"అబ్బా!" అన్నాడు.

"ఏమిటండీ? ఏమయింది?" అంది లలిత కంగారుగా.

"అంత ఎత్తు నుంచీ నదిలో దూకటం కదే! నడుము పట్టేసింది. అమ్మో..." అన్నాడు మరో పక్కకు తిరిగిపోతూ.

"అయ్యో! ఇప్పుడెలాగండీ? డాక్టర్ని పిలవమంటారా?"

"అబ్బే! డాక్టరెందుకు? తెల్లారేసరికి తగ్గిపోతుందిలే. ఈ ఒక్కరోజుకి నువ్వలా వేరే మంచం మీద పడుకో."

లలిత ముఖంలో చిరాకు, నిరాశ కనిపించాయి.

"నాకు సుఖపడే రాతే లేదు లెండి... ఉంటే మీతో ఎందుకు రాసి పెడతాడా దేవుడు?..." అంటూ దిండు తీసుకొని వేరే మంచం మీదకి వెళ్ళి పోయింది.

'హమ్మయ్య!' అనుకొని మళ్ళీ పడుకోబోతుండగా హఠాత్తుగా అతని దృష్టి టేబుల్ మీద ఉన్న ఫోటో మీద పడింది. కళ్ళు పెద్దవి చేసి చూశాడు.

తనూ, రాధా దిగిన పెళ్ళి ఫోటో.

"ఓరిదేవుడా! ఏమిటిది? నిజంగానే నాకూ రాధకూ పెళ్ళయిపోయిందా? మాకు పెళ్ళవలేదనీ, ఆమె నా చెంప పగలగొట్టిందనీ నేననుకుంటున్నదంతా కేవలం కలేనా?" అనుకున్నాడు.

మరి కాసేపు ఆ ఫోటో వంకే పరిశీలనగా చూసేసరికి రూపాల్లో అతి సూక్ష్మ తేడా కనిపించింది. ఫోటోలోని వ్యక్తికి నుదుటిమీద కొంచెం జుట్టు ఊడిపోయింది. అలాగే రాధలా ఉన్న ఈ లలితాదేవి జడలో కూడా తేడా ఉంది. రాధ జుట్టు మరీ పొడుగు. ఈమెది పొట్టి.

తనకో డూప్లికేట్ ఉన్నాడని ఇప్పుడు నిశ్చయంగా ఋజువయింది. కానీ రాధక్కూడా డూప్లికేట్ ఉండటం ఏమాత్రం నమ్మశక్యంగా లేదు. నవలల్లోనూ, సినిమాల్లోనూ ఒకే రూపంగల హీరోలు ఇద్దరుంటారు. కానీ ఇప్పుడు ఒకే రూపం గల హీరోలు ఇద్దరే కాక, హీరోయిన్లు కూడా ఇద్దరున్నారు.

ఇప్పుడు ఏం చెయ్యాలి?...

విషయం అర్థమయాక, లలిత నిద్రపోగానే లేచి పారిపోవాలని నిర్ణయించుకున్నాడు. పక్కకు తిరిగి ఓ కంటితో గడియారం వైపు చూస్తూ పడుకున్నాడు.

✦✦✦

వంటవాడు తెచ్చిచ్చిన ఉత్తరం విప్పి చూసింది రాధ.

"రాధా, బాధా, నా విషాద గాథా..." అన్న సంబోధన చూస్తూనే ఉలిక్కిపడి– "మునెయ్యా!" అంటూ గట్టిగా పిలిచింది.

పిండిలో మధ్యలో పెట్టిన వేలితో పరుగున వచ్చాడు మునెయ్య.

"ఎవరిచ్చారు నీకీ ఉత్తరం?"

"నాక్కాదు. భద్రానికి ఇచ్చాడు."

"ఎవరు?"

"ఇంకెవరు? ఆ సాత్వికరావే... ఏమయినా తప్పు మాట రాశాడా అమ్మా?"

"ఇంకా చదవలేదు. పని చూసుకో!" అతడిని పంపించేసింది.

ఉత్తరమంతా చదివేసరికి ఆమెకు మనసంతా అదోలా అయిపోయింది. తను కాదన్న కారణంగా ఒక నిరంగ నిరంజన నిర్దోష నిర్భాగ్య ప్రేమికుడి ఆత్మహత్యా ప్రయత్నం చదివి... తను ఓటేసిన అభ్యర్థి ఓడిపోయిన ఫీలింగ్ కలిగింది.

"భద్రం!" అంటూ గట్టిగా పిలిచింది.

"ఏమిటమ్మా?"

"సాత్వికరావు ఆత్మహత్య చేసుకుంటున్నానని వ్రాశాడు. వెతికి వెంటనే ఆపండి. త్వరగా పరిగెత్తండి."

"మరి హోటలమ్మా?"

"మూసేయండి. మనిషి ప్రాణం కంటే హోటల్ ఎక్కువ కాదు!"

"మొన్న బిర్యానీలో బొద్దింక పడ్డప్పుడు... హోటల్ కన్నా మనిషి ప్రాణం ఎక్కువ కాదు అన్నారు కదా!"

"అది ఎవడో కస్టమరు. ఇది మన మనిషి!"

"ఇంతకూ అతను ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నాడమ్మా?" మునెయ్య అడిగాడు.

"నేను చెంప దెబ్బ కొట్టానని!"


"మీరు చెంపదెబ్బ ఎందుకు కొట్టారమ్మా?"


"అతను 'ప్రేమించా'నన్నాడని!"

"ఇష్టం లేకపోతే వద్దు అని చెప్పాలి కానీ చెంప దెబ్బ కొట్టడం ఏమిటమ్మా?" అన్నాడు భద్రం.

"నాకు నచ్చలేదు!"

"టిఫిన్ నచ్చకపోతే మన హోటల్లో డబ్బులు ఇవ్వకుండా వెళ్ళిపోతారు కానీ, కౌంటర్ దగ్గరకు వచ్చి మిమ్మల్ని చెంప దెబ్బ కొట్టరు కదమ్మా!" అన్నాడు మునెయ్య.






"షటప్! ముందిద్దరూ వాదనలాపి, ఆయన ఆత్మహత్య చేసుకోకముందే వెతికి పట్టుకోండి. తరువాత ప్రశ్నలేద్దురు గానీ..." అంది కసురు కుంటూ.

✦✦✦

చంద్రబోసు గండిపేట చెరువు గట్టు మీద నిలబడి, సాత్వికరావు తాలూకూ ఆత్మహత్యా పథకం ఫెయిల్ అవటం చూశాడు.

చెరువులో నీళ్ళు తక్కువ ఉండటం, పైగా వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు ఆ కాసిని నీటినీ ఎంతో జాగ్రత్తగా కాపాడుతూ ఉండటం చూసేసరికి, ఆత్మహత్యా స్థలాన్ని మార్చాలని నిర్ణయించుకుని, మళ్ళీ ఇంకో ఆటో ఎక్కాడు.

"ఊరి బయట రైల్వే ట్రాక్ దగ్గరకెళ్ళాలి!"

"మళ్ళీ తిరిగొస్తారా సార్!"

"పిచ్చివాడా! ట్రాక్ తప్పినవాడే ఆ ట్రాక్ ఎక్కుతాడు!" అన్నాడు ఫిలాసాఫికల్‌గా.

"నాక్కావలసిందీ అదేసార్! అలా అలా పైకెళ్ళి పోవాలి గానీ ఆటోల వాళ్ళతో వెధవ బేరాలూ అవీ నాకస్సలు నచ్చవు. అదీగాక మీరెలాగూ సూసైడ్ చేసుకోబోతున్నారు కదా! అంచేత మీటరు మీద పాతిక రూపాయలు ఇవ్వండి సార్."

చంద్రబోసు ఆప్యాయంగా అతని భుజం తట్టాడు.

"సరే. నా దగ్గరున్నదంతా నీకే ఇచ్చేస్తాను... సరా?"

"థ్యాంక్యూ సర్!"

ఆటో ఊరి బయట రైల్వే ట్రాక్ దగ్గరకు చేరుకుంది.

పర్సులో ఉన్న డబ్బంతా ఇచ్చేసి ట్రాక్ మీద పడుకున్నాడు.

గంట గడిచి పోయాక... పట్టాలు రిపేరు చేసుకుంటూ వచ్చిన గ్యాంగ్‌మ్యాన్ అతడిని సానుభూతిగా చూసి, "చావటానికొచ్చారా బాబూ?" అని అడిగాడు.

"అవును! చావటానికే వచ్చాను. కానీ నా మీద జాలి వద్దు. జగదీష్ చంద్రబోసు తెలివి, సుభాష్ చంద్రబోసు ధైర్యం కలిపి పుట్టిన వాడిని! దేన్నైనా భరిస్తాను గాని, సానుభూతిని భరించను!" పట్టాల మీద నుంచి లేవకుండా అన్నాడు చంద్రబోస్.

"నా సానుభూతి మీరు ఛస్తున్నందుకు కాదు... మంచిర్యాల దగ్గర యాక్సిడెంట్ అయింది. ఇది సింగిల్ ట్రాక్. మరో రెండు రోజుల వరకూ ఈ ట్రాక్ మీద రైళ్ళేమీ నడవ్వు!"

చంద్రబోసు నిరాశగా లేచి పట్టాలు దిగి ఊరి వైపు నడవసాగాడు.


"అయినా మీరు చావాలనుకుంటే రైలు 'ఎక్కాలి' గానీ, పట్టాల మీద పడుకుంటే చచ్చే రోజులు కావివి..." వెనుక నుంచి అన్నాడు గ్యాంగ్ మెన్.

తలూపి, మెయిన్‌రోడ్ ఎక్కి... గమ్యం లేకుండా రోడ్ల మీద తిరగసాగాడు.

అంతలో ఎవరో వెనుక నుంచి వచ్చి ఒక్క ఉదుటున గట్టిగా పట్టుకున్నారు.

తన భార్య లలిత ఏమో అని అనుకున్నాడు కానీ ఛాతి మెత్తగా తగలకపోయేసరికి అది మగవాడని గుర్తించి "ఎవరు? ఎవరు? నన్ను వదులు!" అని గింజుకున్నాడు.

"గురూగారూ! మీరా లెటర్ నా చేతికి ఇచ్చి వెళ్ళారు. అక్కడ రాధమ్మేమో మిమ్మల్ని వెతికి తీసుకురమ్మని నా ప్రాణం తీసేసింది. అయినా ఒక స్త్రీ ప్రేమించలేదని ఎవరైనా ఆత్మహత్య



చేసుకుంటారా సార్?... మా హోటల్‌కి రోజుకి వందమంది కస్టమర్లు వస్తారు... కౌంటర్ దగ్గర రాధమ్మగారిని చూసి అందులో యాభైమంది ప్రేమలో పడతారు... మా అమ్మగారు నిప్పు. ఎవర్నీ ఒప్పుకోరు. వాళ్ళందరూ ఆత్మహత్య చేసుకోలేదే!"

"మీ అమ్మగారు ఎవరిని ఒప్పుకోకపోవటం ఏంటి...?" అంత కన్ఫ్యూజన్లోనూ అనుమానం నివృత్తి కోసం అడిగాడు.

"అమ్మగారంటే మా అమ్మ కాదు! మా హోటల్ ఓనర్ రాధగారు!!"

"ఆవిడెవరు?"

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా... "రాధమ్మకి నిజంగా మీ మీద ప్రేమ ఉంది సార్! పైకి మాత్రం లేనట్లు నటిస్తున్నారు. అసలీ ఆడవాళ్ళంతా ఇంతే సార్. మా సీతారావమ్మ కూడా పెళ్ళికి ముందు నేనంటే ప్రేమ లేనట్లు నటించేది... సీతారావమ్మంటే మీకు తెలీదు కద్సార్. అమలాపురంలో నేను ఉద్యోగం చేసినప్పుడు..."

చంద్రబోస్‌కి చిరాకు పుట్టి...

"రేయ్! ఎవర్నువ్వు? ఈ రాధ, సీత, రావమ్మ వీళ్ళంతా ఎవరు?" అని అడిగాడు కోపంగా.

"అదేంట్సార్! అలా అంటారు? ఇందాకేగా మీరు నాకా ఆత్మహత్య ఉత్తరం ఇచ్చింది?"

"నేన్నీకు ఆత్మహత్య ఉత్తరం ఇచ్చానా?"

"గుర్తులేదా సార్? అప్పుడే మర్చిపోయారా? మా సీతారావమ్మ కూడా అంతే సార్!"

"సీతారావమ్మ సరే. రాధమ్మెవరు?"

"మళ్ళీ అదేమాట? రాధమ్మ అంటే కోపం వచ్చి అలా అంటున్నారా?... నేను చెప్పాను కదా! పైకి ఆవిడలా అంటారు గానీ నిజానికి మీరిప్పుడు హోటల్‌కి వస్తే ఆవిడ పెళ్ళికి రెడీ!"

"రేయ్! నీకు మతిపోతే నాకూ పోయిందనుకుంటున్నావా? నాకు ఎప్పుడో పెళ్ళయింది. నా భార్య పేరు లలిత. ఈ రాధ ఎవరో నాకు తెలీదు."


ఇంక లాభం లేదనుకొని భద్రం తన అసిస్టెంట్‌కి సైగ చేసి చెవిలో ఏదో చెప్పాడు.

**(భద్రం ఏం చెప్పాడు?... వచ్చే సంచికలో)**

## నవ్వు కొమ్మచ్చి



సరసి







# థంబ్ నెయిల్స్ చూడముచ్చటరా బాబూ! — చూడముచ్చటరండి!

కండ్లకుంట శరత్ చంద్ర, +1(236)516-1212

**"మీరు ఇలా చేసారంటే... జలుబు రమ్మన్నా రాదు!" ఆ వాక్యం పక్కన, ముక్కుచీదుతున్న ఒక మహిళ ఫోటో, పక్కనే తుమ్ముతున్న ఒక వ్యక్తి క్యారికేచర్ ఉన్నాయి. యూట్యూబ్‌లో ఆ థంబ్ నెయిల్ చూసి, దివ్య పగలబడి నవ్వుతూ...**

**"ఎవరైనా జలుబు రావాలి అని కోరుకుంటారా? వీడూ..వీడి దిక్కుమాలిన థంబ్ నెయిలూ! దీనికి వ్యూస్ మాత్రం లక్ష!" అని అనుకుంటూ, ఫోన్ మీద, చూపుడు వేలితో స్క్రోల్ చేసింది.**

"తమలపాకులో ఇది పెట్టి బీరువాలో పెడితే లక్షలు వస్తాయి.." అని ఇంకో థంబ్ నెయిల్. దాని మీద నోట్ల కట్టలతో ఒకతను సంతోషంతో నోరు తెరిచి ఉన్నాడు.

"అబ్బబ్బబ్బ! ఆ తమలపాకులో పెట్టాల్సిన వస్తువు కోసం, ఇప్పుడీ వీడియో చూడాలా? ఏం దొంగతెలివిరా నాయనా మీది! లక్షలు వచ్చి పడతాయనే జనాల అత్యాశ మీద భలే ఆడుకుంటున్నారు!" అంది దివ్య.

మరి కాస్త స్క్రోల్ చేసి చూసి... "పవన్ కళ్యాణ్ హీరోయిన్ తమ్ముడి పెళ్లిలో ఎలా తింటుందో చూడండి.." ఇంకో థంబ్‌నెయిల్ చదివింది. దాని మీద పెద్దగా తాటికాయంత సైజులో పవన్ కళ్యాణ్ ఫోటో, దాని పక్కనే ద్రాక్షపండంత చిన్నగా ఏదో పెళ్లి ఫోటో, దాని పక్కన ఆవగింజంత సైజులో ఎవరో మహిళ ఫోటో ఉంది. 'ఎవరబ్బా ఈ హీరోయిన్?' అనుకుంటూ ఆ వీడియో తెరిచి చూసింది.

ముందు పవన్‌కళ్యాణ్ చేసిన సినిమాల గురించి,ఆయన రాజకీయ ప్రవేశం గురించి, మొదట ఓటమి, ఆ తర్వాత గెలుపు గురించి, ఆయన డిప్యూటి సి.ఎం అవడం గురించి... మూడు నిమిషాలు చెప్పాక... ఆ తర్వాత ఎప్పుడో 20 ఏళ్ళ క్రితం పవన్‌కళ్యాణ్ నటించిన... ఒక సినిమా హీరోయిన్ తన తమ్ముడి పెళ్ళిలో భోజనం చేస్తున్న 10 సెకన్ల వీడియో చూపారు. అందులో ఆమె అందరూ తినేలానే, నార్మల్‌గానే తింటోంది. కానీ థంబ్ నెయిల్ మాత్రం అలా తయారు చేసారు.

"అబ్బ! ఏం తెలివిరా మీది! కుక్కకు బిస్కెట్ వేసి ముందుకు పిలిచినట్లు, గుర్రానికి క్యారెట్ వేసి పరుగెత్తించినట్లు... థంబ్‌నెయిల్‌తో మమ్మల్ని వీడియోలోకి లాగి మరీ మా టైం తినేస్తున్నారు!

'ఈ హీరో ఆరోజు ఏం చేసాడో తెలిస్తే షాకే!', 'ఆ హీరోయిన్ ఆస్తి మీద కన్నేసిన డైరెక్టర్ ఎవరో తెలుసా?', 'ఈమె చెప్పింది వింటే కన్నీళ్ళు ఆగవు!'....

'ఇదీ థంబ్‌నెయిల్స్ వరస! వీటికే తెగ వ్యూస్ వస్తున్నాయి!' అనుకుంది దివ్య.

అప్పటి దాకా ఆమె పక్కనే కూర్చుని, ఫోన్‌లో ఏదో చూస్తున్న ఆమె తమ్ముడు మాధవ్ మెదడులో ఏవో మెరుపులు మెరిసాయి.


దానికి ఓ కారణం ఉంది!

మాధవ్ ఇంజనీరింగ్ పాస్ అయ్యి, ఉద్యోగాల వేటలో ఉన్నాడు. అయితే, అతడికి ఒక మంచి యూట్యూబర్ అవ్వాలని ఆశ! అనుకున్నదే తడవుగా 'యువర్ మాధవ్' అనే యూట్యూబ్ ఛానల్ తెరిచాడు.

తన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, పక్కింటి వాళ్లకు, ఆ సందు చివరున్న కిరాణా కొట్టు కిరణ్‌కు, బడ్డీకొట్టు బాపయ్యకు, తమకు పాలు పోసే గోపాలరావుకు... ఇలా సాధ్యమైనంత వరకు తన యూట్యూబ్ ఛానల్ గురించి మార్కెటింగ్ కూడా చేసాడు.

అందరూ సంతోషించినట్లుగానే కనిపించారు. అతని ఛానల్‌కు సబ్‌స్క్రైబ్ కూడా అయ్యారు. కానీ వ్యూస్ మాత్రం చాలా తక్కువ వచ్చాయి.

సమాజానికి ఉపయోగపడే కొన్ని వీడియోలు చేసి, యూట్యూబ్‌లో పెట్టాడు. చిటికెడు, పావుతులం, అరగ్రాము వ్యూస్ వచ్చాయి. వ్యూస్ ఎలా పెంచాలో అర్థంకాక బుర్ర బద్దలు కొట్టుకున్న సమయంలో, అతని అక్కయ్య దివ్య అతనికి (అ)జ్ఞానోదయం(!?) చేసినట్లు అయ్యింది.



'అసలు కిటుకు థంబ్-నెయిల్‌లో ఉందన్న మాట! ఎలాగైనా సరే నా మెదడుకు పదును పెట్టి మరీ థంబ్-నెయిల్స్ తయారు చేస్తాను.' అని అనుకుంటూ, సోఫాలో నుండి పైకి లేచి-

"అక్కయ్యా! నువ్వే నా మార్గదర్శి!" అంటూ బయటికి వెళ్ళిపోయాడు.

దివ్యకు ఏమీ అర్థం కాక... 'సడెన్‌గా వీడికే మయ్యింది?' అనుకుంది.

మాధవ్ రోడ్డు మీద తిరుగుతూ, బూటు కాళ్ళతో గులకరాళ్ళను తంతూ ఆలోచించాడు. ఆ తర్వాత, ఓ ప్లేటు మిర్చీ బజ్జీలు తింటూ మరికాసేపు ఆలోచించాడు. అక్కడి నుండి, పక్కనే ఉన్న బస్టాపుకు వెళ్ళి కూర్చొని, వచ్చే పోయే బస్సులు చూస్తూ దీర్ఘంగా ఆలోచించాడు. మెదడులో రకరకాల ఆలోచనలు వచ్చాయి.

"యురేకా...." అని ఒక పొలికేక పెట్టాడు.

బస్టాపులో కూర్చుని పేపర్ చదువుతున్న ఒక పెద్దాయన అదురుకొని చూసాడు. బస్టాపు పక్కనే గొయ్యిలో పడుకొని ఉన్న వీధికుక్క, దెబ్బకు ఝుడుసుకొని పారిపోయింది.

ఇంటికి వచ్చీరాగానే, తల్లి దగ్గరకు వెళ్ళి,

"అమ్మా! ఈరోజు మధ్యాహ్నం వంట ఏం చేస్తున్నావ్?" అని అడిగాడు.

"ఈరోజు ఆదివారం కదా! పులావ్ వండుతున్నాను." అంది.

వెంటనే తన సెల్‌ఫోన్‌తో వంటింట్లోకి వచ్చి, కెమెరా ఆన్ చేసి, తన తల్లి తయారు చేస్తున్న పులావ్‌ను వీడియో తీయసాగాడు.

"రేయ్! ఏం చేస్తున్నావ్?" అడిగింది తల్లి.

"నా యూట్యూబ్ ఛానల్ లో పెడ్తానమ్మా!" అన్నాడు.

తల్లి నవ్వి ఊరుకుంది.

తల్లి పులావ్ వండే విధానాన్ని మొత్తం, ఆమె కనిపించకుండా ఆమె చేతులు మాత్రమే వీడియోలో ఉండేలా వీడియో తీసాడు.

ఆ తర్వాత తన గదిలో దూరి, కంప్యూటర్ ఆన్ చేసి క్లిక్ బెయిట్ లాంటి థంబ్-నెయిల్ తయారు చేసాడు.

ఫోటోషాప్‌లో ఒక పెద్ద బంగారు గిన్నె ఫోటో పెట్టి, అందులో తన దగ్గరున్న పులావ్ ఫోటో అందులో పెట్టాడు.

ఆ పక్కనే- "ఈ పులావ్ తింటే, మీరు కోటీశ్వరులు అవుతారు!" అని రాసి... నోట్ల కట్టల పిక్ పెట్టాడు.

తాను తీసిన పులావ్ తయారీ వీడియోను ఎడిట్ చేసి, యూట్యూబ్ లోకి అప్‌లోడ్ చేసి, థంబ్‌నెయిల్ పెట్టాడు.



ఆ సాయంత్రం మాధవ్ బయటకు వెళు తుంటే, పక్కింటి బామ్మగారు పిలిచారు.

బామ్మ గారు పకపక నవ్వి– “మీ అమ్మ కాపురానికి వచ్చిన కొత్తలో ఆ పులావ్ మీ అమ్మకు నేర్పించింది నేనే! అది నా రెసిపీ. దాన్ని నువ్వు యూట్యూబ్‌లో పెట్టి, నాకే కహానీలు చెప్తున్నావా?” అంది నవ్వుతూ.

మాధవ్ నోరు తెరిచి ఆమె వైపు చూసాడు.

“ఇప్పుడు చెప్పు, ఈ పులావ్ చేసుకు తింటే కోట్లు వస్తాయా?... ఏంటి నాయనా ఈ పైత్యం?” అంది బామ్మ.


వెంటనే మాధవ్ తన జేబులో నుండి ఫోన్ తీసి... “నాకు ఫోన్ వచ్చింది బామ్మగారు!... తర్వాత కలుద్దాం...” అనేసి, తన చెవికి ఫోన్ ఆనించుకొని, “హలో రాజూ! ఆ వస్తున్నా...” అంటూ గబగబా అక్కడి నుండి పరుగెత్తాడు.

కాస్త దూరం వెళ్ళాక అనుకున్నాడు– ‘ఛ! అనవసరంగా నా ఛానల్ సబ్‌స్క్రైబ్ అవ్వమని, నాకు తెలిసిన వాళ్ళకు చెప్పాను!’ అను కుంటూ, తన ఛానల్ తెరిచి చూసాడు. పులావ్ వీడియోకు 740 వ్యూస్ వచ్చాయి. కొత్తగా 100 మంది సబ్‌స్క్రైబ్ అయ్యారు.

బామ్మగారు ఎగతాళి చేస్తే చేసారు గానీ... వ్యూస్ మాత్రం బానే వచ్చాయి.

భోజనం చేసి, గబగబా తన గదిలోకి వెళ్ళి, తలుపేసుకున్నాడు.

“ఏంటి వీడు ఈ మధ్య అదోలా బిహేవ్ చేస్తున్నాడు?” అన్నాడు తండ్రి.






“యూట్యూబ్ ఛానల్ పెట్టాడు కదా! ఏం వీడియోలు పెట్టాలా అని తెగ ఆలోచిస్తున్నాడు నాన్నా!” అంది దివ్య.

గదిలోకి వెళ్ళిన మాధవ్, లైట్ ఆఫ్ చేసి, తన సెల్‌ఫోన్ ఫ్లాష్ లైట్ ఆన్ చేసి...దాని చుట్టూ తన చుట్టూ చేతులు తిప్పుతూ... గోడ మీద నీడలు పడేలా చేసి ఒక వీడియో తీసాడు. ఆ తర్వాత, చాపకు తన చొక్కా తొడిగి, దానికి ఒక వైపు దిండును కట్టి, గది మధ్యలో నిలబెట్టి...దాని నీడ గోడ మీద పడేలా చేసి...ఇంకో వీడియో తీసాడు.


ఆ తర్వాత లైట్ ఆన్ చేసి, కంప్యూటర్ ముందు కూర్చొని ఇంకో థంబ్‌నెయిల్ తయారు చేసి, వీడియో ఎడిట్ చేసి యూ ట్యూబ్‌లోకి వదిలాడు.


ఆ థంబ్‌నెయిల్ మీద, “హైదరాబాద్ ఇంట్లో దెయ్యం ఇదిగో!” అని పెద్ద అక్షరాలతో రాసి, ఆ పక్కన నీడలతో దెయ్యంలా కనిపించే ఫోటో పెట్టి వదిలి, నిద్రపోయాడు.

లేచీ లేవగానే, పాచి మొహంతో సెల్ ఫోన్ తెరిచి, తన వీడియో రిజల్ట్ చూసాడు. 1200 వ్యూస్ వచ్చాయి.

అయితే కామెంట్స్ సెక్షన్‌లో–జనాలు నోటి కొచ్చిన నాటు పదజాలంతో, మాధవ్‌ను సత్కరించారు. “నీ సెల్ ఫోన్‌తో ట్రిక్ చేసి, దెయ్యం కనిపించిది అంటావేంట్రా అక్కుపక్షి!” అని ఒకరు రాస్తే, “దెయ్యమా, నీ శార్ధమా! నీ అడ్రస్ చెప్పు! చెప్పులతో దెయ్యాల్ని వదల డతా!” అని ఇంకొకరు రాసారు.

ఒక కామెంటర్ మాత్రం చాలా సీరియస్‌గా తన మార్కెటింగ్ తాను చేసుకుంటూ, “నా పేరు భూతనాథ్ అలియాస్ దెయ్యాలరాజు. శాకినీ, ఢకినీ, లంకినీ, శంకినీ ఇత్యాది దెయ్యాలు వదలగొట్టబడును. కొరివి దెయ్యా లను తరమటంలో 20 ఏళ్ళ అనుభవం






కలదు. సంప్రదించవలసిన ఈ మెయిల్... deyyalaraju@bhootanath.com అని రాసాడు.

మాధవ్ కు, ఒక పక్క వ్యూస్ వచ్చాయన్న ఆనందం కంటే, తన థంబ్‌నెయిల్ చూసి జనాలు ఆ వీడియో క్లిక్ చేసి చూసి, ఆ తర్వాత ఎంత కోపం తెచ్చుకున్నారో తలుచుకుంటే భయంగానూ,బాధగానూ అనిపించింది.

ఫ్రెష్ అయ్యి, రోడ్డు మీద తచ్చాడుతూ,

'ఈసారి ఏ థంబ్‌నెయిల్ పెడితే బాగుంటుందబ్బా' అని ఆలోచించాడు!

జనాలకు సినిమా పిచ్చి బాగా ఉంటుంది. అందులోనూ మన తెలుగువారికి మరీ ఎక్కువ. అందులోనూ యువతకు మరీ మరీ ఎక్కువ. దాన్ని క్యాష్ చేసుకుంటే సరిపోతుంది కదా!అని ఆలోచించాడు.

గబగబా ఇంటికి వెళ్ళి, సెల్ఫీ ఎలా దిగాలో కొన్ని టిప్స్ కలిపి ఒక వీడియో తయారు చేసాడు.


దానికి థంబ్‌నెయిల్, "ఈ టిప్స్ తో మీరు సినిమా స్టార్ అయిపోతారు!" అని క్రియేట్ చేసి, వీడియో వదిలాడు.

సాయంత్రంలోపు 1500 వ్యూస్, 40 కామెంట్లు వచ్చాయి. అందులో 38 కామెంట్లు దాదాపు ఇలా ఉన్నాయి.

'ఒరే దిక్కుమాలినోడా! సెల్ఫీ టిప్స్ అని థంబ్‌నెయిల్ పెట్టకుండా, ఏంట్రా నీ దిక్కుమాలిన థంబ్‌నెయిల్!', 'సెల్ఫీ దిగితే, సూపర్ స్టార్లు ఎలా అవుతారురా బేవార్స్‌గా!', 'నువ్వూ నీ ఛానల్. అన్నీ దొంగ థంబ్‌నెయిల్స్. పెట్టే వీడియోకు, థంబ్-నెయిల్‌కు సంబంధం ఏమైనా ఉందంట్రా గూట్లే!'

ఆ కామెంట్లు చదివే సరికి, మాధవ్‌కు దెబ్బకు వణుకుడు పుట్టింది.






ఆ రాత్రంతా కలత నిద్రే! ఉదయం లేచాక, ఏం చేయాలో అర్థం కాలేదు. ఇంకా థంబ్ నెయిల్స్ అలాగే కంటిన్యూ చేయాలా లేక ఆపాలా అన్నదాని పై తెగ ఆలోచించాడు.

'కంటిన్యూ చేయాల్సిందే! ఇలా అయితేనే వ్యూస్ వస్తాయి!' అని తీర్మానించుకున్నాడు.

అయితే ఈసారి ఇలా వెయ్యి, 1500 వ్యూస్ చాలదు. 'ఏకంగా లక్ష వ్యూస్ తెచ్చుకోవాలి. ఎలా!' అని బాగా ఆలోచించాడు.

మాధవ్‌కు సడెన్‌గా తమకు పాలుపోసే గోపాలరావు గుర్తొచ్చాడు. వాళ్ళ ఇంట్లో గెదె ఈనిందని, ఉదయమే జున్ను పట్టుకొచ్చి ఇచ్చాడు. వెంటనే ఐడియా రూపు దిద్దుకుంది. తన సెల్ ఫోన్‌తో గోపాలరావు గేదెల పాకకు వెళ్ళాడు.

"ఏంటి బాబూ ఇలా వచ్చావ్?"అడిగాడు గోపాలరావు.

"నేనెప్పుడూ లేగదూడను చూడలేదు. పైగా నా యూట్యూబ్‌లో వీడియో కోసం కొన్ని వీడియోలు తీసుకుంటాను. సరేనా?" అన్నాడు.

గోపాలరావు నవ్వి-"దానిదేముంది? తీసుకో!" అన్నాడు గేదెకు కుడితి కలుపుతూ.

మాధవ్ అక్కడున్న గేదెలను, రెండు రోజుల క్రితం పుట్టిన లేగదూడను ఫోటోలు, వీడియోలు సంతృప్తికరంగా తీసుకొని, వెనుదిరిగాడు.

ఆ వీడియోలు, ఫోటోలు ఎడిట్ చేసాడు. ఆ లేగదూడను, ఫోటోషాప్‌లో నీలం రంగులోకి మార్చాడు.

బాగా ఆలోచించి మరీ థంబ్‌నెయిల్ ఇలా పెట్టాడు– "హైదరాబాద్ గేదెకు నీలిదూడ జననం! జున్ను కోసం ఎగబడుతున్న జనం! తింటే షుగర్ వ్యాధి మటుమాయం!"


ఆ వీడియో నిండా, ఎడిట్ చేసి రంగు మార్చిన నీలి దూడను పదే పదే జూం చేసి చూపించాడు. దాని పక్కనే, తన ఇంటి ఫ్రిజ్‌లో ఉన్న జున్ను గిన్నె ఫోటోలు పెట్టాడు. అయితే, ఆ నీలి దూడ హైదరాబాద్‌లో ఉందని చెప్పాడే గానీ, ఎక్కడుందో చెప్పలేదు. వీడియో నిండా షుగర్ వ్యాధి గురించి, దాన్ని తగ్గించలేక ఎవరెవరు ఎలా అవస్థపడుతున్నారో చెబుతూ...ఆ బర్రె జున్ను తిని ఎలా తగ్గించుకున్నారో ఊరించాడు.

దిమ్మతిరిగేలా 32,000 వ్యూస్ వచ్చాయి!

అయితే దాని కింద, అత్యధిక శాతం కామెంట్స్– 'అడ్రస్ చెప్పండి', 'ప్లీజ్, అడ్రస్ ఇవ్వండి', "అడ్రస్ చెప్పకుండా ఏందిరా నీ తొక్కలో వీడియో!', 'అడ్రస్ చెప్పరా బేకార్ నాయాలా!'... ఇలా వచ్చాయి. ఒకటి రెండు కామెంట్స్ మాత్రం, 'నువ్వు దాన్ని ఫోటోషాప్ లో ఎడిట్ చేసావ్ లేవోయ్! నాకు ఆ మాత్రం తెలీదా?', 'వ్యూస్ కోసం ఎంతకు దిగజారావురా!' ఇలా వచ్చాయి. అయితే ఆ కామెంట్స్ డిలీట్ చేసి పారేసాడు.

మరుసటిరోజు మాధవ్ వీధిలోకి వచ్చాడు.

వీధి చివర ఉన్న కిరాణాకొట్టు కిరణ్, కస్టమర్లు లేక ఈగలు తోలుతున్నాడు.




మాధవ్‌కు స్పార్క్‌లా ఇంకో కొత్త ఆలోచన వచ్చింది. వెంటనే కిరణ్ దగ్గరకు వెళ్ళి, "నీ షాప్‌కు... చాలామంది కస్టమర్లు వచ్చేలా చేస్తాను!" అన్నాడు.

"అలా చేయమని అడిగానా? కమీషన్లు, వాటాలు అడక్కుండా...ఏదైనా సాయం చేయాలనుకుంటే చెయ్యి!"అన్నాడు కిరణ్ తెలివిగా.




"నా యూట్యూబ్‌లో, నీ కిరాణా కొట్టును ప్రమోట్ చేస్తాను!" అంటూ తన సెల్‌ఫోన్ బయటకు తీసి, ఆ కిరాణా షాపు బోర్డును, షాపును వీడియోలు, ఫోటోలు తీసాడు.

"ఇచ్చట సరసమైన ధరలకు బియ్యం, చింతపండు, కందిపప్పు,పెసర పప్పు, నూనె ఇవన్నీ దొరుకును. అని వీడియోలో చెప్తావా?" అడిగాడు కిరణ్.

అలాగే చెప్పాడు మాధవ్!

వీడియోను బాగా ఎడిట్ చేసాక, థంబ్ నెయిల్ తయారు చేసాడు–"ఈ సీక్రెట్ షాపులో బంగారం ఉచితం! త్వరపడండి!" అని థంబ్ నెయిల్ పెట్టాడు... వీడియోలో ముందుగా కిరాణా షాపు బోర్డ్, అడ్రసు చూపాడు– "ఈ షాపులో బంగారం ఉచితం! ఎలాగో ఈ వీడియోలో చూడండి." అని మొదటి వాక్యం చెప్పాడు. ఆ తర్వాత, ఆ షాపు గురించి రెండు నిమిషాలు సోది వేసాడు. ఆ తర్వాత, 'ఈ షాపులో బియ్యం, పాలలాగా చాలా తెల్లగా ఉంటాయి. కందిపప్పు పసుపును మించిన పసుపురంగులో ఉంటుంది. ఇడ్లీరవ్వ ఫ్రెండ్లీగా పలకరిస్తుంది. ఉప్మారవ్వ చెప్మా అంటుంది." ఇలా 10 నిమిషాల పాటు పిచ్చి వాగుడు వాగి, చివరకు "ఈ షాపులో బంగారం లాంటి స్వచ్ఛమైన సరుకు ఉంటుంది. నాణ్యమైన, కల్తీలేని సరుకే కదా... మన ఆరోగ్యానికి బంగారం లాంటిది.... అదిగో అదన్నమాట విషయం!" అని ముగించాడు.



వీడియో కాసేపటికే వైరల్ అయ్యింది! వ్యూస్... పదులు వందలై... వందలు వేలై... వేలు లక్ష అయ్యి...వీడియో దూసుకెళుతోంది.

"అమ్మా! అక్కా! నాన్న...నా వీడియో వైరల్ అయ్యింది! వైరల్ అయ్యింది." అని అరుపులూ కేకలూ పెట్టి, ఆనందంతో కోతిలా గెంతాడు.

ఒక్కసారిగా వారి వీధి, ఏ చార్మినార్ వీధో, సుల్తాన్‌బజార్ అన్నట్టుగా మారిపోయింది. జనమే జనం!!

అందరి నోళ్లలో ఒకటే మాట, 'బంగారం!'

"ఇదిగో అమ్మా! ఇదంతా మనవాడు చేసిన నిర్వాకమే!... థంబ్‌నెయిల్ చూడు ఎలా పెట్టాడో!" అంది దివ్య, తల్లికి తన ఫోన్ ఇస్తూ.

అది చూసిన మాధవ్ తల్లి–

"ఇదేం పనిరా?" అంది కోపంగా.

మాధవ్ తండ్రికి, అరికాలి మంట నెత్తికెక్కింది. "అరేయ్ మాధవ్! అబద్ధపు వార్తలు రన్ చేస్తున్నావా?" అన్నాడు కోపంగా చూస్తూ.

"లేదు నాన్నా! అసలు కిరణ్ బంగారం ఇస్తాడని నేను వీడియోలో చెప్పనే లేదు. అతడి కొట్టులో సరుకే బంగారం అన్నట్టు చెప్పాను." అన్నాడు అమాయకంగా.

"ఎక్కడ? లాస్ట్‌లో చెప్పావా?"అడిగింది అక్క దివ్య.

"అవును! అందులో తప్పేం ఉంది?"

"లీగల్‌గా తప్పేం లేదు కానీ... 90% మందికి వీడియో చివరి దాకా చూసే ఓపిక ఉండదు. థంబ్‌నెయిల్ మాత్రం చూస్తారు, మిగతాది ఊహించుకుంటారు!" అంది దివ్య.

"ముందు ఆ వీడియో డిలీట్ చేసి చావు!" అంది తల్లి.

మాధవ్ ఆ వీడియోను డిలీట్ చేసాడు.

మాధవ్, అతని తండి, అతని అక్క దివ్య, ముగ్గురూ కలిసి కిరణ్ షాపు ముందుకు వచ్చే సరికి, కిరణ్‌తో జనాలు బంగారం కోసం గొడవపడుతున్నారు.

"నా షాపులో బంగారం ఏదీ లేదయ్యా బాబూ!" అంటున్నాడు కిరణ్.

"మర్యాదగా ఇస్తావా ఇవ్వవా?" అని ఒకరు అంటే... "ఇంత దూరం వచ్చానయ్యా! కనీసం తులం అయినా ఇవ్వవయ్యా!" అని ఇంకొకరు,



"నాకు నలుగురు ఆడపిల్లలు. నాకు ఎక్కువ ఇవ్వాలి!" అని ఇంకొకరు.. ఇలా కిరణ్‌ను వేధిస్తున్నారు.

బంగారం ఏదీ దొరకదని జనానికి అర్థమైపోయాక, పిచ్చిత్తిపోయారు!

కొందరైతే, కోపంతో కిరణ్ షాపులో ఉన్న వస్తువులను కిందపడేసారు. మరికొందరు, షాపులో బియ్యం, ఉప్పు పప్పు తీసుకుని పోసాగారు... అరగంట తర్వాత అక్కడ జనం ఎవరూ లేరు!

కిరణ్‌కు, మాధవ్‌ను చూడగానే వొళ్ళు మండిపోయింది. నోటికొచ్చిన తిట్లు తిట్టాడు.

మాధవ్ తండ్రి, కిరణ్‌ను ఊరడించి– "మా కొలీగ్ కూతురి పెళ్ళి సెటిల్ అయ్యింది... వాళ్ళకు కావాల్సిన కిరాణా సామాను నీ షాపులో కొనేలా నేను నీకు హెల్ప్ చేస్తాను... వర్రీ అవకు!" అని అభయం ఇచ్చాడు.

కిరణ్ కాస్త శాంతించాడు.

మాధవ్‌ను గది మధ్యలో కూర్చోబెట్టి తల్లి, తండ్రి, అక్క కలిసి తలంటు పోసారు.

మాధవ్‌కు జ్ఞానోదయం అయ్యింది.

అయితే తన గదిలోకి వెళ్ళి ఒక వీడియో చేసాడు.

"మంచి కంటెంట్‌తో వీడియో చేస్తే ఎవరూ చూడలేదు. అదే సమయంలో ఒకడు... ఈ హీరోయిన్ సైజు ఎంతో తెలుసా? అంటూ థంబ్‌నెయిల్ పెట్టి వీడియో పెట్టాడు....

పదిలక్షల మంది ఎగబడి మరీ ఆ వీడియో చూసారు... ఆ వీడియోలో ఏం ఉందో తెలుసా? ఆ హీరోయిన్ చెప్పుల సైజు ఏడు అని ఉంది. దాంతో పాటు మరికొన్ని వీడియోలు గమనిస్తే, ఇదే తంతు!

అందుకే జనం క్లిక్ చేసేలా థంబ్‌నెయిల్స్ చేసి వీడియోలు పెట్టాను.

అయితే ఇక అలా పెట్టను. ఎంత తక్కువ మంది చూసినా సరే, ఇక మీదట వాళ్ళు దగ్గరపెట్టుకొని మరీ థంబ్‌నెయిల్స్ చేస్తాను!" అని ఒక వీడియో అప్‌లోడ్ చేసాడు.

అయితే అతని నిజాయితీని చాలామంది మెచ్చుకున్నారు.

కథ కంచికి, మనం తర్వాతి పేజీలోకి!

**ఇది చదివితే షాక్!**

ఈ కథ చదివాక మీకు బోల్డన్ని ఐడియాలు వచ్చేశాయని మాకు తెలిసిపోయింది! అందుకే మిమ్మల్ని నిరుత్సాహ పరచకూడదని మేమీ నిర్ణయం తీసుకున్నాం!

ఏదైనా ఒక **థంబ్‌నెయిల్** పెట్టి దానికో కథ రాయండి! ఒక పేజీలోనే రాయాలి!

వెయ్యి రూపాయలు చొప్పున పది కథలకు...

500 రూపాయల చొప్పున 10 కార్టూన్లకు బహుమతులు పొందుతారు!

మీ కథలు కార్టూన్లు అక్టోబర్ 1లోగా పంపండి!

LIKE చేయండి

& SHARE చేయండి....

ఎంతమందికైనా!

'ఈ'మెయిల్‌కి పంపండి- hasyanandampoteelu@gmail.com

నవంబర్ హాస్యానందం **థంబ్‌నెయిల్ తమాషాలు** ప్రత్యేక సంచికగా వెలువడుతుంది!




**శ్రీమతి అన్నం భాగ్యవతి స్మారక పురస్కారం**

## కార్టూన్ పోటీ ఫలితాలు




**బా**చి అవార్డు కార్టూన్ల పోటీకి ఇది ఎనిమిదో సంవత్సరం. ఎప్పటిలానే అనూహ్య స్పందన లభించింది. దాదాపు 120 కార్టూన్లు, 68 ఎంట్రీల ద్వారా వచ్చాయి. ఈసారి రాశి వున్నా వాసి తగ్గిందేమోననిపించింది. ఈ విషయంలో నా సహ న్యాయనిర్ణేతలు ఒకింత అసహనం వ్యక్త పరచడం జరిగింది. కొద్దిమంది పూర్తిగా AI మీద ఆధారపడి పోయి కార్టూన్లు పంపడం జరిగింది. కార్టూన్లు గీయడం రాని వారికి, బొమ్మలు గీయడం అస్సలు రానివారికి AI ఉపయోగపడుతుందేమో గానీ నిలదొక్కుకున్న కార్టూనిస్టులకు కాదని నా నిశ్చితాభిప్రాయం. మళ్ళీ చెబుతున్నాను కార్టూనిస్టు యొక్క ఒరిజినాలిటీని మరియు సృజనాత్మకతని AI దెబ్బతీయకూడదు.

ఏది ఏమైనా పోటీకి వచ్చిన కార్టూన్లతో మాకు బాగా నచ్చిన కార్టూన్లను బహుమతులకు ఎంపిక చేయడం జరిగింది.

విజేతలకు మా హృదయ పూర్వక అభినందనలు. తోటి న్యాయనిర్ణేతలు శ్రీయుతులు రాముగారికి, కామేష్ గారికి, రమణ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. పోటీలో పాల్గొని బాచి అవార్డు కార్టూన్ల పోటీని విజయవంతం చేసిన కార్టూనిస్టు మిత్రులందరికీ ధన్యవాదాలు.

**–బాచి, కార్టూనిస్టు, విజయవాడ, 9848992433.**


**మొదటి బహుమతి రూ.5000/–లు పొందిన కార్టూన్**




**రెండవ బహుమతి రూ.3,000/–లు పొందిన కార్టూన్**




**మూడవ బహుమతి రూ.2000/–లు పొందిన కార్టూన్**



## న్యాయ నిర్ణేత మాట!

ప్రియ మిత్రుడూ 'కార్టూన్ మిత్ర' అవార్డు గ్రహీత శ్రీ బాచి మరియు మిత్రుడూ కార్టూన్ ఇష్టుడు శ్రీ రమణ సోమయాజుల కోరిక మేరకు, వారిద్దరూ మరియు హాస్యానందం సంపాదకులు శ్రీ రాముగారితో కలిసి శ్రీమతి అన్నం భాగ్యవతి (బాచి)స్మారకార్థం నిర్వహించిన కార్టూన్ పోటీలకు వచ్చిన కార్టూన్లు (171) మరియు శ్రీ సోమయాజుల శివ రామయ్య, శ్రీమతి హైమవతి గార్ల స్మారకార్థం నిర్వహించిన కార్టూన్ల పోటీలకు వచ్చిన కార్టూన్లు (137) నిశితంగా పరిశీలించి వాటిలోంచి అత్యుత్తమ (మాకు అనిపించిన) కార్టూన్లను బహుమతులకు ఎంపిక చేయడం జరిగింది. ఎంపిక కొంచెం క్లిష్టమైనా ఎంపికైన కార్టూన్లు పాఠకుల ఆదరణకు నోచుకుంటాయని విశ్వసిస్తున్నాము.

ఈ పోటీలకు వచ్చిన కార్టూన్లను విశ్లేషించిన తరువాత తోటి కార్టూనిస్టులకు మరియు వర్ధమాన కార్టూనిస్టులకు నా సూచన ఏమిటంటే,



కార్టూన్ల విషయంలో కొందరు పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీద ఆధారపడి కార్టూన్లు సృష్టించి పంపుతున్నారు. వారి కంటూ ఒక ప్రత్యేకమైన గీత ఉండగా AI మీద ఆధారపడడం మాకు రుచించలేదు. ఆయా కార్టూనిస్టులు తమ స్వంత గీతలతో కార్టూన్లు వేయమని కోరుతున్నాను. ఇకపై ఎవరు కార్టూన్ పోటీలు నిర్వహించినా AI పై ఆధారపడి సృష్టించిన కార్టూన్లను విధిగా పోటీలనుంచి పక్కన పెడితే అద్భుతమైన తెలుగు కార్టూన్లు పుడతాయి.


కార్టూనిస్టులు అందరూ రెండు పోటీలలో అత్యుత్సాహంతో పాల్గొని తెలుగు కార్టూనిస్టుల ఐక్యతను చాటి చెప్పారు.

అందరికీ అభినందనలు. **–కామేష్, హైదరాబాద్**




**బాచి అవార్డు 2025, సోమయాజుల శివరామయ్య హైమవతి స్మారక కార్టూన్ పోటీ-2025...** ఈ కార్టూన్ పోటీలు విజయవంతం చేసిన కార్టూనిస్టు మిత్రులకు అభినందనలు. కార్టూనిస్టులను ఎంతగానో ప్రోత్సహిస్తున్న ఈ 'మిత్రద్వయం' శ్రీయుతులు బాచిగారికి, ఎస్.వి.రమణ గారు క్రమంతప్పకుండా ప్రతియేట ఆగష్టు,15న ఈ బహుమతి ప్రదానోత్సవం నిర్వహించడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం! ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ప్రముఖ కార్టూనిస్టు శ్రీ కామేష్‌గారికి ధన్యవాదాలు! విజేతలకు అభినందనలు! –సంపాదకులు


## జ్యూరీ బహుమతులు పొందిన ఒకో కార్టూన్‌కి రూ.500/–లు నగదు బహుమతి(10)





















# బహుమతి ప్రదానోత్సవ సభ

**ఆగస్టు,15 వ తేదీ, శుక్రవారం, సాయంకాలం 6గంటలకు.**

**విజయవాడ బందరురోడ్డులో రాఘవయ్య పార్క్ ఎదురుగా ఉన్న**

**'బాలోత్సవ భవన్‌లో'**




## కార్టూన్ పోటీ ఫలితాలు

**ఒకో కార్టూన్‌కి
1000 రూపాయలు చొప్పున
10 బహుమతులు**





అందరికీ నమస్కారం. ఎప్పటిలాగానే ఈ సంవత్సరం నేను నిర్వహించిన సోమయాజుల శివరామయ్య హైమవతి స్మారక కార్టూన్ పోటీలలో పాల్గొన్న కార్టూనిస్ట్ మిత్రులందరికీ నా కృతజ్ఞతలు. ఈసారి పోటీ కొంచెం మార్పుతో చేయటం జరిగింది. ఎక్కువమంది కార్టూనిస్టులను ప్రోత్సహించటం మంచిది అనిపించి, ఒక కార్టూన్‌కి వెయిరూపాయలు చొప్పన పది కార్టూన్లు ఎంపిక చేయటం జరిగింది. పోటీలో సీనియర్ కార్టూనిస్టులు, ఔత్సాహిక కార్టూనిస్టులు పాల్గొనటం జరిగింది. పోటీకి 137 కార్టూన్లు వచ్చియి. చాలా ఆనందకరం. వాటిల్లో నుంచి ఉత్తమమైనవిగా 10 కార్టూన్లు ఎంపిక చేయటం జరిగింది.


ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీకామేష్ గారు, హాస్యానందం పత్రిక పంపాదకులు శ్రీరాము గారు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వారికి నా కృతజ్ఞతలు తెలియ చేస్తున్నాను. బహుమతులు ఆగస్టు 15న విజయవాడలో జరిగే కార్యక్రమంలో అంద చేయటం జరుగుతుంది.


భవదీయుడు.


**రమణ సోమయాజుల, హైదరాబాద్. 9849666827**




















## శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక అవార్డు-2024 గ్రహీత-

ప్రముఖ కార్టూనిస్ట్ **శ్రీఎస్.వి.రమణ(అరుణ్)**



**సుమారు 49 ఏళ్ళ నుండి కార్టూన్లు వేస్తున్న శ్రీఅరుణ్ గారి మొదటి కార్టూన్ 1976 లో అనామిక పత్రికలో అచ్చయ్యింది. ఇప్పటిదాక సుమారు ఇరవై ఐదు వేలకు పైగా కార్టూన్లు వివిధ పత్రికల్లో ప్రచురించబడింది. అన్నీ భారతీయ భాష పత్రికల్లో వీరి కార్టూన్లు ప్రచురించబడింది.**




# గీతల పాత బంగారం

**'పూర్వ భాషేచ రాఘవః'...** ఎదురైన మనిషిని శ్రీ రామచంద్రుడు ముందుగా తనే నవ్వుతూ పలకరించేవాడట. అలా ముందుగా నవ్వుతూ పలకరించింది ఈ పుస్తకం మీది 'గీతానందం' పేరు.


ఆహా! ఒక కార్టూన్ పుస్తకానికి ఇంతకంటే చక్కని పేరు ఏముంటుంది? కొన్నేళ్ల క్రితం నా మూడవ కార్టూన్ పుస్తకాన్ని జయదేవ్ గారికి అంకితం ఇస్తూ 'గీత గోవిందుడు' గా ప్రస్తావించానాయనను.

ఆనాడు జయదేవుడు సంస్కృతంలో 'గీత గోవిందం' అందిస్తే, ఈనాడు మన జయదేవ్ గారు గీతల్లో ఈ 'గీతానందం' అందిస్తున్నారు.

గీతలు పాతవైనా ఆనందం ఎప్పటికప్పుడు కొత్తదే. అది వసి వాడనిది.

ఆ రోజుల్లో 'స్వాతి' వీక్లీలో ప్రతివారం ఒక ఫుల్‌పేజీ కార్టూన్ల సంబరం కనిపించేది. లబ్ధ ప్రతిష్టులైన అనేక మంది కార్టూనిస్టులు తమ ఫుల్‌పేజీ కార్టూన్లను వేసి మురిపించేరు... 'స్వాతి'లో ఈ ప్రక్రియకి ఆద్యులు జయదేవ్ గారే.

'ఒక పక్క వేరే ప్రక్రియల్లో బిజీగా ఉండి కూడా బాపుగారు తన జీవితంలో ఇన్ని చిత్రాలు, కార్టూన్లు ఎలా వేశారబ్బా' అనుకునే వాళ్ళం... అదే ఆశ్చర్యం ఇప్పుడు మళ్లీ కలిగింది.




ఒక పక్క కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తూ జయదేవ్‌గారు ఇన్ని వందల కార్టూన్లు వేశారంటే వారు సమయాన్ని ఎంత సద్వినియోగం చేసుకున్నారో కదా అనిపిస్తుంది.

సన్నని గీతల్లో ఎక్కువ వివరాలు చెప్పడానికి అవకాశం ఉంటుంది. మొదటినుంచి వీరి శైలి అదే.

ఒక గ్రామం...ఒక వీధి... ఒక మీటింగు... ఒక ఇంట్లో వాతావరణం ఇలా ఏది తీసుకున్నా ఎంతో శ్రద్ధ పెట్టి, 'ఒక కార్టూనుకు ఇంత సమయం, శ్రమ పెట్టాలా?... ఎవరు చూడొచ్చారు?... ఏం గిట్టుబాటు అవుతుంది?' అని ఆలోచించలేదాయన. తన ధర్మం తాను నిర్వర్తించినట్టు ఎన్నో వివరాలను వివరణాత్మకంగా వేసారు, వేస్తున్నారు ఇప్పుడు కూడా.

'అన్ని వారాలపాటు ఇన్ని అంశాల మీద కార్టూన్లు వేసి, తర్వాత వచ్చే మీకు ఏమీ మిగల్చలేదురా ఆయన!' అన్నాడొక మిత్రుడు పుస్తకం చూసి.

నిజమే!... సమాజంలో అన్ని తరగతుల జీవితాలకు సంబందించిన ఏ అంశాన్నీ వదలి పెట్టలేదాయన.

'జయదేవ్ గారి ప్రతి కార్టూను కార్టూనిస్టులకు ఒక రిఫరెన్స్' అని నేను ఎప్పుడూ చెబుతూ ఉంటా.


ఈ పుస్తకాన్నివీలైనపుడల్లా పారాయణం చేయండి. ఎన్ని కొత్త కొత్త ఆలోచనలు, ఊహలు వస్తాయో కార్టూనిస్టులు చూడండి.

ఇలా మరుగున పడిన మాణిక్యాలను బయటకు తీసి హారంగా గుచ్చి... హాస్య ప్రియుల మెడలో వేసిన... 'అక్షజ' పబ్లికేషన్ వారు అభినందనీయులు.

**ఈ పుస్తకం వెల:175 రూపాయలు.**

పుస్తకం కావలసిన వారు– 8712729057, 8341450673– ఈ నెంబర్లకు సంప్రదించండి!

**–సరసి**






మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని
పరిచయం చేస్తున్న శీర్షిక! 15

## భగవాన్ (సెల్ఫీ)

పూర్తి పేరు కొవ్వూరి భగవాన్‌రెడ్డి. భగవాన్ పేరుతో కార్టూన్లు వేస్తున్న నేను పుట్టింది పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర. పెరిగింది కంతేరు. సెటిలయ్యింది నెగ్గిపూడి (మార్టేరు) అమ్మానాన్నలు కొచ్చవరి సూర్యకాంతం, సోమిరెడ్డి.

ఎమ్.ఎస్సీ (జువాలజీ) ఎమ్.ఇడి చేసిన నేను ఎస్.డి.ఎస్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ జంగారెడ్డి గూడెంలో ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యాను.

బొమ్మలు గీయడం బొత్తిగా రాని నేను ఇంటర్మీడియట్‌లో బోటనీ, జువాలజీ రికార్డులకు బొమ్మలు మా అక్క (శ్రీమతి విజయలక్ష్మి)ను బ్రతిమాలి వేయించేవాడిని. అప్పట్లో మా ఇంటికి వచ్చే వార, మాస పత్రిల్లో వచ్చే కార్టూన్లను చూస్తున్నప్పుడు నేనెందుకు కార్టూనిస్టు కాకూడదు అన్నదే తడవుగా శ్రీజయదేవ్‌గారి కార్టూన్లను ప్రాక్టీస్ చేస్తూ చేస్తూ మొత్తం మీద 1981లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో మొదటి కార్టూన్ అచ్చయ్యింది.


మొదట్లో నా కార్టూన్లలో మగ కేరెక్టర్లకు గుండు వేసేవాడిని. పాఠకేయ మిత్రులు గుండుబొమ్మల భగవాన్‌గా నామకరణం చేయడంతో ఆ తర్వాత కార్టూన్లలో కూడా అదే ట్రెండ్ కంటిన్యూ చేయాల్సి వచ్చింది.


ఇప్పటిదాక దాదాపు ఓ పదివేలకు పైగా కార్టూన్లు అన్ని పత్రికల్లో అచ్చయ్యాయి. వాటిల్లో కొద్దో గొప్పో కార్టూన్లకు ప్రైజులొచ్చాయి కూడా. నా కార్టూన్లలో సందేశం కన్నా నవ్వింతకే ప్రయత్నం చేస్తా.

ప్రఖ్యాత కార్టూనిస్ట్, డిజిటల్ చిత్రకారుడు శ్రీగోపాలకృష్ణ నేనూ బాల్య స్నేహితులం. ఫేస్‌బుక్‌లో తన కార్టూన్లతో కేరింతలు పుట్టిస్తున్న మిత్రుడు ప్రఖ్యాత కార్టూనిస్ట్ శ్రీవాడ్రేవు, నేను ఒకే ఊరివాళ్ళం.

నన్ను అమితంగా ప్రోత్సహించే శ్రీమతి కనకదుర్గ, అబ్బాయి ప్రవీణ్, కోడలు వాణి, మనుమడు మోహనశ్రీకర సూర్యభగవాన్, మనుమరాలు శ్రీలక్ష్మి తన్మయదుర్గ నా కుటుంబ నేపథ్యం.


అన్నట్టు మిత్రుడు ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీబాచిగారి ప్రోత్సాహం, కార్టూనిస్టులకు అనునిత్యం హాస్యానందం పత్రిక ద్వారా ఉత్సాహపరుస్తున్న నిత్య కృషీవలుడు శ్రీ రాముగారి నేతృత్వంలో భగవాన్ కార్టూన్ల పుస్తకం త్వరలో రాబోతుందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.





















మేనేజర్






మన మెడికల్ షాప్ లో మందులు కొనకుండా ఉడాయిస్తుంటే లాక్కొచ్చాం డాక్టర్..



ఇదిగో.. కొత్త ఆ పుస్తకం పక్కన పెట్టి సెల్ చూడండి.. అందరూ వింతగా చూస్తున్నారు..








మరీ అంత వెటకారమొద్దు బావా.. రేపో మాపో మనకీ అదే గతిరా..


నా వాట్సప్ స్టేటస్ లో మన అభిమాన హీరో కాకుండా నన్ను కని పెంచుతున్న మా అమ్మానాన్నల ఫొటో పెట్టా.. తప్పంటారా?!




**ఈ నెల రచయితలు: డా॥రావు ✦ అగస్త్య ప్రగడ హేమంత ✦ అవధానుల జగన్నాథ రావు**

## మూడవ సీన్ –డా॥రావు

(గత సంచిక తరువాయి)

**అతనికి ఎన్నో నాటకాల్లో దుష్టపాత్రలు వేసిన అనుభవం ఉంది, మాట్లాడితే "థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ఇక్కడ" అని కూడా అంటూ ఉంటాడు తన అనుభవాన్ని నిరూపించుకోవడానికి.**

**సినిమాల్లో నటించాలన్న అతని ఆశ అనేక కారణాల వల్ల నెరవేరలేదు. ఇప్పుడతనికి ఆ కోరిక ఇంతింతై, ఎంతో అయ్యి కూర్చుంది. ఏదైనా అవకాశం వస్తే ఒక్క సినిమాలో అయినా నటించాలని ఆశ పడుతున్నాడు.**

**వీళ్ళ మాటలు చాటునుండి వింటుంటే ప్రాణం లేచొచ్చింది అతనికి. ఆలస్యం చేస్తే లాభం లేదనుకున్నాడు.**

ఒక్కదుటన చెట్టు చాటు నుండి దూకినట్లుగా శేషాచలం ఆయన వెనకున్న ఏకనాథంల ముందు ప్రత్యక్షమయ్యాడు.

"మహాప్రభో! ఏలిన వారు కరుణించాలి, నా గోడు వినిపించు కోవాలి, నా ఆశ మీ ద్వారానే తీరాలి!" దాదాపు ఏడుపు గొంతుతో అన్నాడు.

నిజానికి శేషాచలం ఒరకంటితో అతన్ని ముందే గమనించాడు.

అతని ఆశ కూడా తెలుసు తనకు. కాస్త బెట్టు చేస్తే సుయోధన రావుని తమ సినిమాలో హీరోయిన్ ప్రతిభారాణి తండ్రిగా, విలన్‌గా డబ్బులివ్వకుండానే అతని ఆశని అడ్డుపెట్టుకుని లాగించేయచ్చు అని ఆల్రెడీ అనుకున్నాడు.

పైకి మాత్రం "ఎంత మాట సుయోధనంగారూ! నాటకాల్లో మీ ప్రతిభ నాకు తెలియందా? కానీ ఏదో నాది చిన్న బడ్జెట్టు, మీ అంతటి వార్ని నేను భరించలేను! నాకు తెలుసు మీరు మా సినిమాలో నటిస్తే ఆస్కార్ వచ్చినా రాకపోయినా, మనదేశం నుండి నామినేట్ అయ్యే తీరులో మీ నట విశ్వరూపం చూపిస్తారని..." అంటూ కాస్త ఉబ్బేశాడు.

ఇంకేముంది... సుయోధనరావు, శేషాచలం మాటలకు మురిసి ముక్కలయ్యాడు.

"మీరు నాకు అవకాశం ఇవ్వండి, నా తడాఖా చూపిస్తాను, ప్రకాష్ రాజ్‌కి ఏమాత్రం తీసిపోనని నిరూపిస్తాను." అన్నాడు.

అలా శేషాచలం తీయబోయే సినిమాకు విలన్ కమ్ హీరోయిన్ తండ్రి కూడా ఫిక్సయిపోయాడు.

ఇలా ముగ్గురూ మాట్లాడుకుంటూ నడుస్తుండగా, ఆకాశంలో మెరుపు మెరిసినట్లయింది.

## నాల్గవ సీన్ –అగస్త్య ప్రగడ హేమంత

ఒక్కసారిగా ఉలిక్కిపడి ముగ్గురూ తలలు పైకెత్తి చూశారు.

అందంగా కిందికి దిగుతున్న అస్తమయ సూర్యుడి కిరణాలు ఏట వాలుగా ఎగిరొచ్చి, ఆరో ఫ్లోర్ బాల్కనీలో ఉన్న ఏదో వస్తువుకి తగిలి, పరావర్తనం చెందడం వల్ల పుట్టిన మెరుపది.

మాటల్లో పడి తాము సుయోధనరావుంటున్న అపార్ట్‌మెంట్స్ దగ్గరకి ఒచ్చేశామని మిగిలిన ఇద్దరూ గ్రహించేలోపు... దుష్ట పాత్రల నట సింహం సుయోధనరావు మొహం కోపంతో జేవురించిపోవడమే కాక, పళ్ళు కూడా పటపటమని శబ్దం చేశాయి. అరక్షణంలో అదోలా ఐపోతున్న అతన్ని చూసి, ఒకేసారి అదిరిపడ్డారా ఇద్దరూ!

**ఫ్లాష్‌బ్యాక్–** శేషాచలం పదవీ విరమణ చేశాక, వచ్చిన డబ్బులలో మిగిలిన ఓ లక్ష రూపాయతో తన చుట్టూ ఉన్న వాళ్ళని వాడుకుని ఒక చిన్న ఓటీటీ సినిమా తియ్యాలన్న ఉద్దేశంతో పరిచయస్థులను వాడుకునే క్రమంలో...

"ఎందుకలా అయిపోతున్నారు?" అని శేషాచలం ప్రశ్నిస్తే...

"ఆ మెరుపేవిటసలు? దాని వల్లే ఈయనిలా అవుతున్నట్టున్నారు!"

"దీనికి ఎన్నిసార్లు చెప్పినా బుద్ధుండదు. మొహం ఈడ్చు!" అన్నాడు మళ్ళీ... కోపంతో కుతకుత లాడిపోతూ!

"ఎవరికీ?" అడుగుతుంటే 'కీ..చు'మంది శేషాచలం కంఠం.

"మా ఆవిడకి!" ఠక్కున చెప్పాడు.

అప్పటికే అతను ఆవేశంతో, కుండల బరువెక్కువైన కల్లు తాడిలా అటూఇటూ ఊగిపోతున్నాడు.

"ఇప్పుడావిడెందుకొచ్చిందిక్కడికి?" అయోమయంగా ప్రశ్నించాడు ఏకనాథం.

సమాధానంగా వేలు పెట్టి మెరుపు మెరిసిన దిశగా చూపించాడు నటసింహం.

"సో... వ్వాట్?!!??" తూటాలా దూసుకొచ్చిందా మాట శేషాచలం నోటి వెంట.

"ఆ మెరుపేవిటో తెలుసా?" గద్దించాడు... గుడ్లెర్రజేసి ఇద్దర్నీ మిర్రి మిర్రి చూస్తూ!

"మాకెలా తెలుస్తుంది?" ముక్తకంఠంతో అన్నారా ఇద్దరూ!

అది వాళ్ళు చేసిన మరో పొరపాటు.

అంతే! "ఏ...య్ఁ..!" అంటూ ఒక్క పెడబొబ్బ పెట్టాడు సుయోధన రావు. ఆ వెంటనే ఎగిరి ఒక్క దూకు దూకాడు.

"ధిక్... ధిక్కారమును సల్పుడీ.." అంటూ యశోదకృష్ణలో కంసుడి పద్యాన్ని అందుకుని పాడుతూ మరో నాలుగు చిందులేశాడు.

అంతా అయ్యాకా... ఆయాస పడుతూ... అప్పుడు చెప్పాడు...

"ఎన్నో నాటకాల్లో నేను వేసిన దుష్ట పాత్రలకు మెచ్చి, 'పాచిపెంట'



గ్రామస్తులు నాకు కానుకగా ఇచ్చిన ఇత్తడి 'గద' అది... మా ఆవిడ నన్ను పస్తు పెట్టినా భరిస్తాను కానీ, వారానికోసారి ఓ కేజీ చింత పండుతో దాన్ని తెల్లగా తోమి, ఎండలో పెట్టక పోతే మాత్రం స..హిం..చ..లేను...


ఇప్పుడింతకీ అసలు విషయం ఏవిటంటే... అది ఉదయం గదని తోమి ఎండలో పెట్టేసి ఇప్పటివరకూ దాన్నలాగే బాల్కనీలో ఒదిలేసిం దన్నమాట! గదంటే నా ఎద! దాన్నలా ఎండకీ వానకీ ఒదిలేయడం... నా మటుకు నాకు చి..త్ర..వ..ధ! అందుకే... ఈ ఖోఫం... హావేషం... హాళరుఖుఢీ... హంథానూ!" నటనలో లీనమైపోయి... ఆ చివరి మాటల్ని అతనలా నొక్కి నొక్కి, చిత్ర విచిత్రంగా చెబు తుంటే చూస్తున్న వాళ్ళిద్దరూ సుయోధనరావు ఓవరాక్షన్‌కి తట్టుకోలేక పోయారు.

సరిగ్గా అప్పుడే, పులి మీద పుట్రలా...

"ఎలా ఉంది నా నటన?..." అడిగాడు సుయోధనరావు, తిరిగి మామూలవుతూ!

సినిమా అవకాశం అనగానే అతనలా మరీ పీచు కొబ్బరికాయ చేతికందిన పిచ్చి కోతిలా, పండిపోయిన తాట్టెంక నోటికందిన పిల్లల పందిలా వ్యవహరిస్తాడని శేషాచలానికి తెలి యదు పాపం!

లేకపోతే సుయోధనరావు ఎగురుకుంటూ ఒచ్చినప్పుడే చెప్పేసుండేవాడు... ఇలా ఓవరా క్షన్‌లూ అవీ చెయ్యకూడదని. కానీ నోరు జారేసాకా ఏం చెయ్యలేం కనుక, ఏడవలేక నవ్వాడు.




"బావుంది!" అన్నాడు వెర్రి నవ్వు నవ్వుతూ.

"కానీ ఇక ముందు మీరు కెమేరా ఎదు రుగా తప్ప... ఎక్కడ పడితే అక్కడ ఇలా, అనవసరంగా మాత్రం నటించకూడదు. అలా ఐతేనే నేను మీకు సినిమా ఛాన్సిచ్చేది!..." ముందు జాగ్రత్తగా కాస్త బెదిరించాడు.

వెంటనే మారిపోయాయి సుయోధనరావు ముఖ కవళికలు. ఒక కనుబొమ మాత్రమే పైకెత్తి... "ఎందుకూ?!" అనడిగాడు తీక్షణంగా శేషాచలం ముఖంలోకి చూస్తూ!

అతనలా చటుక్కున కంసుడి అవతారం ఎత్తేసరికి అదిరిపోయాడు శేషాచలం.

"ఎందుకంటే... జనం ఝడుసుకు ఛస్తారు కనుక!" మనసులోనే అనుకున్నాడు.

పైకి మాత్రం– "అంటే మీ ఎనర్జీ లెవెల్స్ సూపర్! వాటి ఫ్రెష్‌నెస్ పోనివ్వకుండా కాపా డుకోవడం నిర్మాతగా నా ధర్మం! అందుకని!" అన్నాడు మళ్ళీ ఓ వెర్రి నవ్వు నవ్వుతూ.

దాంతో పొంగిపోయాడు సుయోధనరావు.

"నిజమే! నా అభినయ సామర్థ్యాన్ని అనవ సరంగా ఖర్చు చేయకూడదు. ఇక నుంచీ శేషా చలం గీసిన గీటు దాటకూడదు!" మనసులోనే నిశ్చయించుకున్నాడు సినిమా వేషం పిచ్చిలో తల మునకలైపోతున్న సుయోధన్రావ్.

## ఐదవ సీన్– అవధానుల జగన్నాథ రావు


సుయోధనరావు ఇంటి దగ్గరకు వచ్చేసరికి అతని ఓవర్ యాక్షన్ చూసి చూసి శేషాచలా నికి నెత్తి మీద వంద మొట్టికాయలు తిన్నంత నొప్పి మొదలయింది.

"సుయోధనరావుగారూ! ఆలోచనలతో తల బద్దలై పోతుంది. చెల్లెమ్మగారికి చెప్పి నాలుగు టీ చుక్కలు గొంతులో పోయిద్దురూ మీ పుణ్యం ఉంటుంది" అంటూ సుయోధనరావుతో పాటు శేషాచలం కూడా లిఫ్ట్‌లోకి దూరిపోయాడు.

తన భార్యను– "చెల్లెమ్మ" అనీ సంభోదించి నందుకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టు అయింది సుయోధనరావుకి.

వెంటనే కాస్త తమాయించుకొని...


"శేషాచలంగారు మా ఆవిడ సాయంకాలం శివాలయానికి వెళుతూ ఉంటుంది. ఈ టైంలో ఇంట్లో ఉండదు. అందువల్ల మీరు ఏమీ












అనుకోకండి" అన్నాడు.

"అదేమిటండి అలా అంటారు. ఇందాక గద ఇంట్లో పెట్టలేదని మీరు మీ ఆవిడ మీద కారాలు మిరియాలు నూరుతున్నప్పుడు... సాక్షాత్తు లక్ష్మీదేవి లాగా బాల్కనీలో కనబడి తేనూ..." అన్నాడు శేషాచలం.

సుయోధనరావుకి శేషాచలాన్ని ఇంటికి రాకుండా మాన్పించడానికి ఏమీ ఆలోచన తట్ట లేదు. శేషాచలం తలుపు పక్కగా చెప్పులు విప్పుకుంటుంటే... సుయోధనరావు మెల్లగా తలుపు తట్టాడు. తలుపు ధడేలున తెరుచు కొంది... తలుపు వెనక నుండి మాటలు తూటాల్లా రాలిపడ్డాయి.

"పొద్దున్నే గంటసేపు అరకిలో చింతపండు ఖర్చు చేసి ఆ గదను తోమి ఇంట్లో ఇంకెక్కడ జాగా లేనట్లు బాల్కనీలో పెట్టారు. దివాలా దీసిన నాటకం కంపెనీ వాళ్ళు వేలం వేస్తుంటే వెయ్యి రూపాయలు పెట్టి కొన్నారు... ఆ దిక్కు మాలిన ఇత్తడి రేకు గద!... నేను దానివల్ల ఎదురింటి ఆవిడతో అరగంటసేపు యుద్ధం చేయాల్సి వచ్చింది. ఆ గద తోముడు పూర్తి అయిన తర్వాత మిగిలిన చింతపండుతో అటక మీది ఇత్తడి గుండిగ తోమేయమంటే తోమలేదు! రోజు మాములుగా తోమినట్టు ఆ నాలుగు అంట్ల గిన్నెలను కూడా తొమలేదు. తడి ఆరిన తర్వాత ఆ ముష్టి గదను ఇంట్లో తగలబట్టి ఉండొచ్చు కదా! అలా అందరికీ కనపడేలా అక్కడ ఉంచేయకుండా!..." ఛాయా దేవి గారి సినిమాల్లో ఛాయాదేవికి తాను ఏ మాత్రం తీసుపోని విధంగా గట్టిగా గొంతు పెట్టి అరిచి విసురుగా లోపలికి వెళ్ళి పోయింది.

"ఆవిడ తీరే అంత! చిరుకోపం కొంచెం ఎక్కువ. నేను ఇంట్లో పనులు ఏమీ చేయనని తనకి నామీద ఏదో కాస్త చిన్న పిసరు కోపం. కాస్త సిగ్గు కూడా ఎక్కువ... అందుకే కొత్త వాళ్ళని ఎవరిని చూసినా అలా మాట్లాడి లోపలికి వెళ్ళిపోతుంది. మీరు కూర్చోండి. నేను లోపలికి వెళ్లి కాస్త కాళ్ళు కడుక్కుని వస్తాను" అంటూ లోపలికి వెళ్ళాడు సుయోధన రావు.

అప్పుడు అర్థమైంది సుయోధన రావు ఓవర్ యాక్షన్ వెనక ఉన్న రహస్యం!!


వంటింట్లోంచి మొగుడూ పెళ్ళాలు ఘాటిగా మాట్లాడుకుంటున్న గుసగుసలు హాల్లో కూర్చున్న శేషాచలానికి చక్కగా వినిపిస్తు న్నాయి.

"బాబ్బాబు!... అవతల సినిమా తీసే పెద్ద మనిషి వచ్చాడు. నీ ఇత్తడి గుండిగ తర్వాత తోమిపెడతా గానీ కాస్తంత టీ పెట్టి ఇయ్యవే... నీకు పుణ్యం ఉంటుంది."

"ఇప్పుడు నాకు టీ పెట్టే ఓపిక లేదు. మీరే పెట్టుకోండి."

"పోనీ టీకి అన్నీ గిన్నెలో వేసి పెడతాను మరిగిన తరవాత కప్పుల్లో పోసి, హాల్లోకి తీసుకొచ్చి ఇయ్యవే!"

"ఊ సరే! కప్పులూ అవీ అన్నీ గట్టు మీద పెట్టి వెళ్ళండి." **(సశేషం)**



# కొత్త వ్రతం

మాధవి బైటారు, +974 3395 2728

**"భాను! భానూ..." అని ఆఫీసుకి బయలుదేరబోతున్న భానుప్రకాష్ ని ప్రేమగా చూస్తూ– "ఇంటికి వచ్చేటప్పుడు నూటఇరవై లడ్డూలు తీసుకురండి." అని అంది జ్ఞానేశ్వరి.**

**"ఇప్పుడెందుకన్ని?!" అని ఆశ్చర్యపోతున్న భానుప్రకాష్ చేతికి కారు తాళం ఇస్తూ... "వచ్చాక చెప్తాగా!" అని నవ్వుతూ సాగనంపింది.**

**సాయంత్రం ఇంటికి వచ్చిన భానుప్రకాష్ ఇంట్లోని పరిస్థితి చూసి బిత్తరపోయి పొరపాటున వేరే ఇంటికి వచ్చానా అని ఒక్క ఉదుటున బయటికి వెళ్ళబోయి... తన ఇల్లే అని నిర్ధారించుకుని లోపలికి వచ్చాడు.**

**ఊరు నుండి తన తల్లితండ్రులు వస్తారంటే చిన్న ఇల్లు కాబట్టి సరిపోదు, వాళ్ళని పిలవద్దని గొణికే జ్ఞానేశ్వరి ఇంతమంది ఆడవాళ్ళని ఎందుకు పిలిచిందో అని బుర్ర గోక్కున్నాడు.**


హాలు మధ్యలో పెట్టిన ఓ కొత్త స్వామీజీ ఫోటో ముందు కూర్చుని... మహిళలంతా మంత్రాలు చదవుతున్నారు.

భర్తని చూడగానే స్నానం చేసుకురమ్మనమని సైగ చేసింది జ్ఞానేశ్వరి.

బెడ్రూంలోకి వెళ్ళి బట్టలు మార్చుకుంటున్న భానుప్రకాష్కి ఆ మంత్రాలు ఎప్పుడూ వినని విగా, వింతగా అనిపించాయి.

ఏదో కొత్త పూజ అయ్యింటుంది, లడ్డూలు అందుకే తెమ్మనమని చెప్పింది కాబోలు అని సమాధానపడ్డాడు.

కాసేపయ్యాక అందరూ పూనకం వచ్చినట్లు ఊగిపోతూ మంత్రాలను గట్టిగా చదవసాగారు.




దాంతో తన కోరిక తప్పక తీరుతుందని... ఆనంద పడసాగింది జ్ఞానేశ్వరి.

ఇక పూజ అయ్యాక తాంబూలాలు ఇచ్చే ఘట్టం వచ్చింది.

జ్ఞానేశ్వరి, భానుప్రకాష్ దగ్గరికి వచ్చి–

"మీరూ, మనబ్బాయి కలిసి పిల్లల బెడ్రూం లో ఉన్న చీరల్ని ఒక్కొక్కటి అందించండి." అని ఆర్డర్లాంటి అభ్యర్ధన చేసింది.

పిల్లల బెడ్రూంలోకి వెళ్లబోయిన భాను ప్రకాష్ తుళ్లిపడ్డాడు.

'ఇది గదా, చీరల షాపా?' అని ఆశ్చర్య పోతూ... ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా చీరలగుట్ట కిందపడి గుండాగి పోయేది అని గుండెలు బాదుకున్నాడు.

లోపలికి వచ్చిన జ్ఞానేశ్వరితో–

"ఎక్కడివన్ని?! ఎప్పుడు కొన్నావు? డబ్బు లెక్కడివి?" అని కోపంగా అడిగేసరికి....

"తాంబూలం ఇచ్చేవరకు నేను మాట్లాడ కూడదు, మీరూ నోరు మూసుకుని వాటిని అందించండి." అని సైగ చేసింది.

అందరిముందు అరిస్తే పరువుపోతుందని ఒక్కొక్కటి అందించసాగాడు.

పట్టు చీర, తాంబూలం ఆనందంగా అందుకున్న అతివలు– "నీ కోరిక తప్పక తీరాలి, తీరుతుందని" గట్టిగా హామీ ఇచ్చి, అక్షితలు వేసి చీరల రంగులు, డిజైన్స్ చూసు కుంటూ ఇళ్ళకి వెళ్ళిపోయారు.

ఆఖరావిడ కూడా వెళ్లిపోగానే...

"ఏంటిదంతా...?" అని చిందులువేశాడు భానుప్రకాష్.

"మొన్నా మధ్య డాక్టర్ దగ్గరికి వెళ్తే నా సుగర్ 'నూట నలభై' ఉందని... అలాగే బీపీ 'నూట ఎనభై బై నూట పది' అని చెప్పి సుగర్ నూట ఇరవై, బి.పి. నూట ఇరవై బై ఎనభైకి రావాలని చెప్పారు కదా! అది విన గానే చాలా భయపడి ఫోన్లో చిట్కాలు కోసం వెతుకుతుంటే వేలకివేలు కనిపించాయి... వాటిలో తిండి తగ్గించమని, నడవమని, ఎక్సె ర్సైజ్ లు చెయ్యమని ఏవేవో చాలా కఠినమైన పనులు చెప్పారు..." అని అంది జ్ఞానేశ్వరి.

"అవి పాటిస్తే మంచిదే కదా!... తిండి తగ్గించుపోనీ..." అన్నాడు భానుప్రకాష్.

"అమ్మో!! ఓ ముద్ద తగ్గితే మొహం పీక్కుపోయి ముడతలు పడిపోతాయి... దాంతో చుట్టూ ఉన్న చుప్పనాతోళ్లు నాకేదో మాయ రోగం వచ్చిందని ప్రచారం చేసేస్తారు!" అని భయంగా అంది.

"పోనీ రోజూ ఆరువేల అడుగులైనా వెయ్యి..." అనగానే...

"ఇంటెడు చాకిరీ చేసేసరికి అలిసిపోతాను ఇంకెక్కడ నడుస్తాను?" అని పెదవి విరిచింది.

'పనిమనిషి, వంటమనిషి, ఇంటినిండా మిషన్లు ఉంటుండగా... బండెడు చాకిరీ చేస్తున్నావా?' అని గొణుక్కున్నాడు.

ఐనా ఆశ చావని భానుప్రకాష్...

"పోనీ జిమ్‌లో చేరితే..." అంటుండగానే...

"ఆ ఎక్సెర్సైజ్‌లు గట్రా మా ఇంటావంటా లేవు! " అని అంటూ...

"ఐనా పనీపాటా లేని వైద్యులు అలాగే చెప్తారులెండి..." అని నాలుక చప్పరించేసింది.

నూట ఇరవై తాంబూలాలు, మిఠాయిలు పంచాలట. అలా చేయకపోతే నాకే కాదు. మీ ప్రాణాలకి కూడా ప్రమాదం అని హెచ్చరించారు. ఇవన్నీ చెప్పిన స్వామీజీ ఫోటోయే అది..." అని హాల్లోని ఫోటోకి తన్మయత్వంగా దండం పెట్టుకుంది.

"కేవలం ఎనభై వారాలు ఇలా అందరినీ పిలిచి నిష్ఠగా చేస్తే నా సుగర్, బీపీ మామూలు అయిపోతాయట. జీవితంలో మళ్ళీ రావట!" అని గంతులు వేయసాగింది.

"ఎనభై వారాలా!???... అని ఆశ్చర్యపోయి...

"ఇంతకీ ఈరోజు ఖర్చులకి డబ్బులు ఎక్కడివి?" అని నీరసంగా అడిగాడు భానుప్రకాష్.

"మొన్నామధ్య ఓ ఫైలు మీద మీరు పెట్టిన సంతకానికి వచ్చిన రెండు లక్షలతో కొన్నాను. కొనబోతున్న వాటి గురించి ఇంట్లోవాళ్లకి అస్సలు తెలియకూడదన్నారు. తెలిస్తే ఫలితం ఉండదన్నారని మీకేవి ముందు చెప్పలేదు." అని అంటూ...

"బంగారం లాంటి మీరిలా సహకరిస్తే ఎనభై వారాలు ఎంతసేపు...



మరెలా వాటిని తగ్గించుకుందామని ఆలోచిస్తుందో అని చూస్తున్న భానుప్రకాష్‌తో...

"అస్సలు ఏమాత్రం కష్టపడకుండా చిటికెలో సులువుగా నా సమస్య తగ్గించే ఓ వ్రతం గురించి గొప్ప మహానుభావుడు చెప్పిన వీడియో నా అదృష్టం కొద్దీ కంటపడింది. అదే ఈ రోజు మొదలుపెట్టాను!" అని కళ్ళు మెరుస్తుండగా అంది జ్ఞానేశ్వరి.

"ఇంతకీ ఆ మహానుభావుడు ఎవరో తెలుసా?" అని కళ్ళు తిప్పుతూ 'సోది చెపుతాం' చానెల్ లో 'ఓం నూట ఇరవైయాయై నమః', 'ఓం ఎనభైయై నమః' అనే మంత్రాలను నేను చదవకుండా, నూట ఇరవై మంది ఆడవాళ్ళతో చదివించి... వాళ్ళకి నూట ఇరవై పట్టు చీరలు,

కళ్ళు మూసి తెరిచేలోపు అయిపోతాయి. మన ఊర్లోని ఆడవాళ్ళకి పట్టుచీరలు, తాంబూలాలు ఇచ్చేస్తే పక్క ఊర్లోని వాళ్ళని పట్టుకొచ్చైనా వ్రతం పూర్తి చేస్తాను" అని స్థిరంగా, పట్టుదలగా చెప్తున్న జ్ఞానేశ్వరిని చూస్తూ ...

'నీకు జ్ఞానేశ్వరి అని కాదు... అజ్ఞానేశ్వరి అని పేరు పెట్టాల్సింది' అనుకుంటూ కళ్ళు తిరిగి కిందపడిన భానుప్రకాష్ ఎప్పుడు కోలుకుంటాడో?!



# ఇండియన్ ఇంక్
## భారతీయ కార్టూనిస్టులు



**ఈ నెల నుండి ఒక ఇతర భాషలకు చెందిన భారతీయ కార్టూనిస్టులను పరిచయం చేయబోతున్నాము.**

**నిర్వహణ: నాగిశెట్టి**

ఈ నెల కార్టూనిస్ట్- **శ్రీ ప్రతాపన్ పులిమత్**

**వీ**రి అసలు పేరు ప్రతాపన్ నాయర్.వి.ఎస్.

వీరు పుట్టింది- మే, 25 1963న. తండ్రి-శ్రీ వేలాయుధన్ పిళ్ళై, తల్లి- శ్రీమతి సుమతి, భార్య- శ్రీమతి శ్రీలీల, కొడుకులు- అఖిల్ మరియు అతుల్, కోడలు- విష్ణుప్రియ, మనుమరాలు చి॥ నీల.







ఈయన మొట్టమొదటి కార్టూన్ 1979 లో 'మమంకం' అనే మలయాళ వారపత్రికలో ప్రచురింపబడింది. తరువాత మలయాళ మనోరమ, మంగళం, దీపిక, మనోరాజ్యం, సఖి, చంపకం, వనిత, గృహలక్ష్మి, బాలభూమి, పక్కనార్, హాస్య కైరళి, చిరిచెప్పు, మనోరమా కామిక్స్, కుట్టన్, కేసవెట్టన్, కుమారి, జనయుగం వంటి అనేక దిన, వార, మాస, హాస్య, బాలల, మహిళా పత్రికలలో వేల కొలదీ కార్టూన్లు వేయడమే కాక, అనేక క్యారెక్టర్లు డిజైన్ చేయడం, స్ట్రిప్ కార్టూన్లు వేయడం, వంటివి చేసారు.


టింగూ అనే క్యారెక్టర్ తో అమృత భారతి సిండికేట్లో ఎన్నో సైలెంట్ కార్టూన్లు వేశారు. వీరు 1992లో మలయాళంలో నిర్మించిన ఓ ఫాబీ అనే సినిమా కోసం ఫ్యాబీ అనే క్యారెక్టర్‌ను సృష్టించి, తద్వారా బాంబేలో యానిమేషన్ రంగంలోకి అడుగు పెట్టారు. తరువాత ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌లో జాయిన్ అయ్యారు. అయితే ఆయనకు యానిమేషన్ రంగం పై ఉన్న మక్కువ వల్ల జాబ్‌కి లీవ్ పెట్టి 1999లో కేరళలో మొదలైన 'Toonz' అనే యానిమేషన్ స్టూడియోలో జాయిన్ అయి, తరువాత 12 సంవత్సరాలు వేర్వేరు యానిమేషన్ స్టూడియోలలో ఫ్యాకల్టీగా పనిచేసి ఈ రంగంలో చక్కటి అనుభవం సంపాదించారు.

2024 నుండి Yeldo Mar Baselios College అనే ప్రముఖ కాలేజీలో యానిమేషన్ మరియు గ్రాఫిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కార్టూనింగ్ అంటే ప్రజల కళా రూపం మరియు దృశ్య రూపం అని, అన్ని వయసుల ప్రజలు ఆనందించవచ్చునీ, కార్టూన్ అనేది ఒక పదునైన ఆయుధం అనీ, దీని ద్వారా సమాజంలోని అవినీతి, అన్యాయం, బంధు ప్రీతి, స్వార్థం వంటి వాటిని ఎండగట్టవచ్చని ఈయన నమ్ముతారు. అవగాహన కలిగించడంలో కార్టూన్లు శక్తిమంతమైన మీడియంగా పనిచేస్తాయని ఈయన అంటారు.

వీరి కార్టూన్లలో కార్టూన్ కి కావలసిన అన్నీ లక్షణాలూ ఉంటాయి. చక్కటి బొమ్మలు, తక్కువ కాప్షన్, యాక్షన్, బాక్‌గ్రౌండ్, సందేశం, వ్యంగ్యం, హాస్యం మొదలైనవన్నీ. ఖాళీ సమయాల్లో పిల్లలకీ, పెద్ద వాళ్ళకీ, కార్టూన్లు నేర్పిస్తూ ఉంటారు.

ఫోన్ నంబర్. 9895283605. ఫేస్‌బుక్ చిరునామా: https://www.facebook.com/ prathapan.pulimath



# కనుమరుగైన కార్టూనిస్టు బంధువులు

## తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం ప్రేరకులు

**కార్టూన్లు** చూసి, చదివి ఆనందించే వాళ్ళు లక్షల కోట్ల సంఖ్యలో వుంటారు. అయితే కార్టూన్లతో పాటు, కార్టూనిస్టులను ప్రేమించి అభిమానించే కార్టూనిస్టులు చాలా అరుదుగా కనిపిస్తారు. వారిలో అగ్రశ్రేణి కార్టూనిస్టుల్లో ఒకరైన ముల్లంగి వెంకట రమణా రెడ్డి గారంటే ప్రతి తెలుగు కార్టూనిస్టుకు అపారమైన గౌరవం, మర్యాదా.

కొందరి అపూర్వ వ్యక్తుల వెనుక మరికొందరు అత్యంత అపూర్వ వ్యక్తులు నీడల్లా కనిపిస్తారు. ఉదాహరణకి బాపూ గారిని తలుచుకుంటే వారి నీడగా రమణ గారు కనిపిస్తారు. అలాగే ముల్లంగి గారి వెనక నీడలా మనకి దర్శనమిచ్చే వ్యక్తి తలిశెట్టి రామారావుగారు.

తలిశెట్టివారిని తలుచుకోని తెలుగు కార్టూనిస్టు ఈ భూ మండలంలో లేరనే చెప్పాలి... ఎందుకంటే ఆయన తెలుగు కార్టూన్ పితామహుడు.



ఆయన ద్వారా తెలుగు కార్టూన్ పుట్టి ఇప్పటికి తొంభై ఎనిమిది సంవత్సరాలు కావస్తోంది, మరో రెండేళ్ళలో శత సంవత్రోత్సవానికి సిద్ధమవుతున్నారు కార్టూనిస్టులు.

తెలుగు కార్టూనిస్టుల దినోత్సవానికి శంకుస్థాపన చేసిన అతి ముఖ్యమైన వ్యక్తుల్లో ఒకరైన ముల్లంగి వెంకటరమణారెడ్డి గారిని తెలుగు కార్టూనిస్టులు శిరస్సు వంచి చేతులెత్తి నమస్కరిస్తారు.

ముల్లంగి వారు ఒక సామాన్య ప్రభుత్వోద్యోగి. లోకంలో అందరూ అభిమానించే ఒక పోస్ట్‌మాన్. ఈ పోస్ట్‌మాన్‌కి ఒక ప్రత్యేకత వుంది. ఈయనకి కార్టూన్లంటే మహాఇష్టం. ముఖ్యంగా తలిశెట్టి రామారావు గారి కార్టూన్లంటే మరీ ఇష్టం. ఆ కార్టూన్లని పత్రికల పేజీల నుంచి కత్తిరించి, రూపాయ నోట్లకన్నా విలువైనవిగా భావించి భద్రపరిచారు. కొందరు సాహితీ మిత్రుల సహకారంతో, గట్టి సంకల్ప బలంతో తలిశెట్టి రామారావుగారి తొలి తెలుగు వ్యంగ్య చిత్రాల రెండు సంకలనాలని ముద్రించారు. ఆ సంకలనాల మూలంగా అజ్ఞాతంలో వున్న తలిశెట్టి వారి విశ్వరూపాన్ని తెలుగుపాఠక లోకానికి పరిచయం చేశారు.

ఇప్పుడాయన పుణ్యలోకాల్లో వున్నారు. తలిశెట్టి వారిని కోటు సూటూ బూటూలతో ముస్తాబు చేసి మురిసిపోతున్నారు.


**-జయదేవ్, చెన్నై**

## తెలుగు కార్టూనిస్టుల ప్రోత్సాహకులు

**జీవిఆర్** ఆరాధన సంస్థ వ్యవస్థాపకులు, సాంస్కృతికవేత్త గుదిబండి వెంకటరెడ్డి (84) గారు హాస్యానందం వేదికగా కార్టూన్ పోటీలు నిర్వహిస్తూ, బహుమతి పొందిన కార్టూనిస్టులకు సముచితంగా సత్కరించే గొప్ప కళాపోషకులు.

తమ 83వ పుట్టిన్రోజు సందర్భంగా పోటీలకు వచ్చిన 83 కార్టూన్లతో ఒక పుస్తకాన్ని ముద్రించారు. డా॥ కె.వి. రమణగారి పుట్టిన్రోజు సందర్భంగా ప్రతియేట సభలు నిర్వహించి, కథల, కార్టూన్ల పోటీలో విజేలతకు బహుమతులు అందజేసేవారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యా శాఖలో టైపిస్ట్‌గా చేరి డిప్యూటీ డైరెక్టర్ స్థాయిలో పదవీ విరమణ చేశారు. యువకళావాహిని శ్రీవై.కె. నాగేశ్వరరావు గారి ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకున్నారు. ఆరాధన సంస్థ ప్రారంభించి ఎందరో కళాకారులను, రచయితలను ప్రోత్సహించారు. తరువాత ఆ సంస్థని జీ.వి.ఆర్. ఆరాధనగా మార్చారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో గొప్ప గొప్ప సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. వేలాది మందిని సత్కరించారు.



సత్కరించడమే కాకుండా ఎన్నో సత్కారాలు కూడా పొందారు.

2022 సంవత్సరం మార్చి 22న హాస్యానందం **'నవరస కళామిత్ర'** బిరుదునిచ్చి సత్కరించింది. గత కొన్నాళ్ళుగా ప్రతి పుట్టినరోజుకు ఒక కవితా సంకలనం ప్రచురించడం అలవాటుగా మార్చుకున్నారు.

నిత్యం కళ కోసం తపించిన తపస్వి శ్రీ గుదిబండి వెంకటరెడ్డిగారికి హాస్యానందం నివాళి అర్పిస్తోంది.



# Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

## ఏది జరిగినా మన మంచికే

**"ఇంత దూరం వచ్చేశాక, మన ప్లాన్ నుంచి తప్పుకుని వెనక్కి వెళ్ళిపోతా నంటావేంటి?... నీకేమైనా పిచ్చా! నేను పెళ్లి చేసుకుంది మా నాన్న బలవంతం మీద, అతన్ని ఇష్టపడి కాదు. అందుకే నీ మీద ప్రేమతో, నీతో కలిసుండాలనీ ఇలా నా మొగుడిని హనీమూన్ పేరుతో ఇక్కడికి తీసుకువచ్చాను. నిన్నూ ఇక్కడికి రమ్మన్నాను. పాస్ట్‌లో మనం ప్రేమలో పడి ప్రేమికులవయ్యాం... ఫ్యూచర్‌లో శాశ్వతంగా కలిసి ఉండాలంటే, ప్రెజెంట్ నువ్వు ముందుకు వచ్చి, మా ఆయన్ని ఈ ప్రపంచం నుండి మాయం చేయక తప్పదు. నువ్వేం చేస్తావో తెలీదు, మా ఆయన్ని మన మధ్య నుండి అడ్డు తొలగించాలి... అతన్ని మన మధ్య నుండి సెపరేషన్ చేసే ఈ ఆపరేషన్‌లో, నా కోపరేషన్ నీకు పూర్తిగా ఉంటుంది!" చెప్పింది లలిత**



ఆమె మాటలు వింటూనే... కొంచెం బిక్క మొహం వేస్తూ...

"నన్నును రమ్మమ్మంది ఇందుకా? నేను క్రైం సినిమాలు చూడటానికే వణికిపోతాను... ఇక క్రైం చేయమంటే... గుండాకి చచ్చూరుకుంటాను. అయినా... తేలిగ్గా ఏదో ఫుడ్ ఆర్డర్ చేయమన్నట్టు మర్డర్ చేయమని అడుగుతున్నావా? నీ ప్రేమికుడిని హంతకుడ్ని చేయాలని కంకణం కట్టుకున్నావా? ఇవన్నీ నా వల్ల కాదు. నన్ను వదిలేయ్!" అన్నాడు భయంగా వెనక్కి వెనక్కి జరుగుతూ...

"ఏమిటి చిన్న పిల్లాడిలా నీ భయం, నువ్వు ఈ పనికి ముందుకు వస్తే, తర్వాత ఇద్దరం కలిసి జింగిచకా చెయ్యి మజా అంటూ మన లైఫంతా హాయిగా బతికేయొచ్చు. మన పెళ్ళయ్యాక, నేను నీతో సరసాలు చాలు శ్రీవారు అంటూ నిన్ను గట్టిగా వాటేసుకుని" అంటూ లలిత గెంతుతూ వెళ్ళి మధుని వాటేసుకోబోయింది.

"నోరుముయ్యి! సరసాలు కాదు చెరశాల పాలైపోతాం. పైగా ఏవిటీ భయం అని నన్నే భయం లేకుండా అడుగుతున్నావా? అయితే విను, మా అమ్మకి అల్సర్, నాన్నకి షుగర్, తమ్ముడు రిసెర్చ్ స్కాలర్, చెల్లి పెళ్ళి ప్రెజర్... ఇవన్నీ వదిలేసి నీతో ప్లెజర్ కోసం ఇలాంటి డేంజర్ పనులు చేసి, జీవితంలో లూజర్‌గా మిగిలిపోలేను. మా అమ్మ నాకు ఉగ్గుపాలు పట్టి కష్టపడి పెంచింది, నా జీవితం బుగ్గిపాలు చేసుకోడానికి కాదు. కనుక టుయ్యా మాటలు మాట్లాడి జీవితాలతో ఆట్లాడకు. బుద్ధిగా వెళ్ళి, మీ ఆయనతోనే... సరసాలు చాలు శ్రీవారు పాట పాడుకో. ఇలాంటి పనులు చేస్తే, జన్మ మెత్తితిరా అనుభవించితిరా... అనే పాటని ఇద్దరం కలిసి పాడుకోవాలి. కాబట్టి నువ్వు మీ ఆయన దగ్గరకి వెళ్ళి పతియే ప్రత్యక్ష దైవం అనే పాట పాడుకోవడమే నయం!" చెప్పాడు చిరాగ్గా.


"అర్థం అయింది మధూ!... నాకు మొత్తం అంతా అర్థం అయింది!!... నీ మొహం చూస్తుంటే ఇంకో పాట కూడా గుర్తొస్తోంది పుడు." చెప్పింది లలిత

"హమ్మయ్య!... తొందరగా అర్థం చేసుకున్నావ్. ఇలా నీకు అర్థం అయ్యేలా చెప్పి నీ మనసు మార్చాలనే ఇంత దూరం వచ్చాను. ఇక నా మొహం చూస్తే నీకు గుర్తొస్తున్న ఆ పాట... మానవత్వం పరిమళించే మంచి మనిషికి స్వాగతం..." అని ఇంకేదో చెప్పేంతలో...

"ఆ పాట కాదెహే! మగాళ్ళు ఒట్టి మాయగాళ్ళే అనే పాట. ఇప్పుడు నాకు మొత్తం అర్థం అయింది. పైకి చార్లీచాప్లిన్‌లా కనిపించే నీలో, ఓ చార్లెస్ శోభరాజ్ ఉంటాడని ఊహించలేదు... అన్నం తిన్నాక అరటి ఆకులా, డ్రింక్ తాగాక డిస్పోజిబ్ గ్లాస్‌లా నన్ను విసిరి పారేయాలనుకుంటున్నావ్. నేను నీ మీద పెట్టు

కున్న ఆశ తుస్సయిపోయింది. నీమీద పెట్టుకున్న ఫుల్ నమ్మకం ఇప్పుడు నిల్ అయిపోయింది. నన్ను నువ్వు బొమ్మలా ఆడుకుని, వస్తువులా వాడుకుని వదిలేద్దాం అనుకుంటున్నావ్. నిజంగా నువ్వు నన్ను ప్రేమించి ఉంటే, పొయ్యి మీద పులుసులా ఈ పాటికే నీ రక్తం మరిగిపోయేది. ఇలా తాడిలా నిలబడి బోడి కబుర్లు చెప్తూ నించునేవాడివి కాదు. నువ్వు నా విషయంలో తప్పు చేస్తున్నావ్!"

"తప్పా! నేనా? అయినా మీ నాన్నది తప్పు. కూతురిష్టం గౌరవించలేని ఆ తండ్రి బలవంతంగా ఇంకొకరితో నీకు పెళ్లి చేశాడు. తండ్రిని ఎదురించలేక అతను చూపిన వ్యక్తితో తాళి కట్టించుకుని, ఇప్పుడు అతన్నే అడ్డు తొలగించుకోవాలనుకుంటున్న కూతురు! బావుంది! అయినా నేను కోరుకున్నది ఒక సున్నితమైన మనసున్న అమ్మాయిని. మనుషుల్ని చంపే పిశాచిని కాదు. ఈ రోజు అతన్ని చంపించి నా దగ్గర చేరతావ్. రేపు ఇంకొకరితో కలిసి నన్ను చంపినా చంపుతావ్!... నీపై నాకు నమ్మకం లేదు... ఇలాంటి మనస్తత్వం ఉన్న అమ్మాయి నాకే కాదు, ఎవరికీ నచ్చదు. ఎందుకంటే, ఒకరికి చిన్న దెబ్బ తగిలితే, అయ్యో అనే అమ్మాయి కావాలి కానీ, గొయ్యి తీసి పూడ్చి మరీ అడ్డు తొలగించుకోవలనుకునే అమ్మాయి అక్కర్లేదు. తన సుఖం కోసం ఎంతకైనా తెగించే నీలాంటి అమ్మాయి నాకొద్దు. నువ్ అంతగా నన్ను ప్రేమించి బ్రతక లేకపోతే, నువ్వే ఆత్మహత్య చేసుకోవచ్చుగా!" అన్నాడు ఆవదం మొహంతో.




"ఆత్మహత్యా! నేనా? అమ్మో, నా చావు నేను చావాలంటే నాకు చచ్చేంత భయం... నేను చచ్చినా ఆపని చేయలేను!" అంది భయంగా కళ్ళు తేలేస్తూ.

"ఆహా! నీ ప్రాణం అంటే నీకు తీపి, ఇంకొకడి ప్రాణం అంటే వగరు... నువ్వు ఇలాంటి మనస్తత్వం కాకుండా కాస్త మానవత్వం ఉన్న మనిషిగా మారాలి. అలాగే నేను దీంట్లో తల దూర్చలేను. అంతగా నువ్వు, అతన్ని వద్దనుకుంటే లీగల్‌గా వెళ్లి విడాకులు తీసుకో. కానీ ఆ తర్వాత కూడా నా మీద ఆశలు పెట్టుకోకు. ఎందుకంటే, నిన్ను పెళ్లి చేసుకోడానికే అతన్ని నీ నుండి దూరం చేసానని అందరూ అనుకుంటారు... అది నాకిష్టం లేదు. ఏది జరిగినా మంచికే అని నువ్వు అనుకోవాలి. ముందుకు సాగిపోవాలి. నువ్విప్పుడు చేయాల్సింది అదే!" చెప్పి వెళ్లిపోయాడు.

తర్వాత తండ్రికి ఫోన్ చేసి-

"నాన్నా! మధుని ఇప్పుడే కలిశాను. ఏది జరిగినా మన మంచికే అనుకుని, జీవితంలో ముందుకు వెళ్ళమని నాకు నచ్చజెప్పి... నా మనసు మార్చాడు. అలాంటి మంచివాడ్ని నాకు దూరం చేసావ్ కదరా దొంగ నాన్నా! వ్వా..." అంది ఏడుస్తూ

"నోరుముయ్యి! ఆ మధు పెద్ద ఏక్టర్. వాడి అబద్ధాలు, మాయ మాటలూ నమ్మి ఇన్నాళ్ళూ గొర్రెలా మోసపోయావ్! వాడే నా దగ్గరకి వచ్చి... మీ అమ్మాయి, ప్రేమా, పెళ్ళీ అంటూ నన్ను చంపుకు తింటోందీ... వెంటనే పెళ్ళి చేయమని నాతో చెప్పాడు. వేరే కోటీశ్వర్రాలయిన అమ్మాయితో వాడికి పెళ్ళి కూడా కుదిరిందట. అతనే నేరుగా నీకీ విషయం చెబితే... నువ్ తట్టుకోలేవని అంటే... నేను విలన్ అయ్యి నీకీ పెళ్ళి చేసాను!" అని తండ్రి చెప్పి చెప్తుండగానే... లలిత బుర్ర గిర్రున తిరిగింది.




# అదీ కథ!

ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 9393662821

అప్పుడప్పుడే తెల్లవారుతోంది. సెంటు వాసన గుప్పుగుప్పుమని ముక్కుకు తగిలే సరికి దుప్పటి పక్కకి తీసి చూసింది జయప్రియ.

అప్పటికే మొగుడు బాల భాస్కర్ నిద్రలేచి స్నానం చేసి సెంటు కొట్టుకోవడం గమించింది.

'మూడు రోజులకొకసారైనా స్నానం చేయమంటే ... 'జయా... పని చేసి చేసి టైర్డ్ అయ్యానని రిటైర్ చేసింది ప్రభుత్వం. నేను స్నానం చేస్తే ఏమి... చేయకపోతే ఏమి... సింహాలు స్నానం చేసేది నువ్వు ఎప్పుడైనా చూశావా?...నన్ను ఈ శేష జీవితంలోని ప్రతి క్షణాన్నీ ఆస్వాదించనీ... అని చెప్పి తప్పించుకునే వాడు. ఈ రోజు ఈయనకు ఏమయ్యిందబ్బా' అని ఆశ్చర్యపోయింది.



గబగబా వెళ్ళి మిద్దె మీద ఉన్న గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు.

పని మనిషి చేర్చే కాఫీ, టిఫన్లు, భోజనాలు ఆ గదిలోనే పుష్టిగా స్వీకరిస్తాడు.

రెండో రోజు–

నిద్ర లేచి బ్రష్ చేస్తోంది జయప్రియ.

అప్పటికే బాలభాస్కర్ వైట్ అండ్ వైట్ డ్రస్ వేసుకుని తల వెంట్రుకలకి హెయిర్ క్రీం రాసు కుంటూ ఉన్నాడు.

'నెత్తి మీద పట్టుమని... పది వెంట్రుకలు కూడా లేవు. వాటికెందుకు వయ్యారం?... అయినా ఆయన వారానికొకసారి ఆముదం తప్పితే మరేమీ రాయడే... ఇప్పుడు కొత్తగా

పొడిపొడిగా వెంట్రుకలు కనబడాలని క్రీము రాస్తూ ఉన్నాడు' అని విస్తుపోయింది.

అడుగుదామనుకుంది కానీ... రక్తపోటు మనిషికదా... 'ధూమ్ ధాం' అని ఎగురు తాడేమో అని గమ్మున ఉండి పోయింది.

స్టైలుగా ఇస్త్రీ చేసిన డ్రెస్‌తో మిద్దె మీదకు వెళ్ళడం కసికసిగా చూసింది. ఆమె కోపానికి కారణం సార్ వేసిన ఇస్త్రీ డ్రెస్ మాత్రమే కాదు, సార్ చేసిన 'టక్' కూడా!

'అరవైలో ఇరవై వచ్చిందని అనుకుం టున్నాడేమో... నేల మీద కూర్చుంటే టక్కు మని లేయలేని మనిషి. పెళ్ళీడుకొచ్చిన ఆడ పిల్లలు హాస్టల్‌లో ఉన్నారని మరిచినాడేమో' అని మూతి మూడుసార్లు తిప్పింది.

చేసేదేమీ లేక బ్రష్‌తో పండ్లను మరింత గట్టిగా తోమింది.

చిగుళ్ళ మంటలకి తట్టుకోలేక బ్రష్ చేయడాన్ని కొద్దిసేపటికే చాలించింది.


మూడవ రోజు–

ఉప్మా చేయడానికి ఉల్లిపాయలు కోస్తూ ఉంది జయప్రియ.

ఉల్లి ఘాటుకు ముక్కులో నుంచి నీళ్ళు బొటబొటా కారుతూ ఉన్నాయి. అయినా ఆ ముక్కుకు, కొత్త గుడ్డకు ఉండే చక్కటి వాసన చురుక్కుమని తగిలింది.

'ఏమిటా...' అని చిన్నగా తల తిప్పి చూసింది.

మొగుడు బాలభాస్కర్... కొత్త కంపెనీ





బ్రాండు బన్నియన్ వేసుకుంటూ కనిపించాడు. వేసిన చొక్కాలే వేసివేసి... అవి చిరిగేదాకా మార్చని నా మొగుడు కొత్తగా బన్నియన్ వేసే స్థాయికి ఎదిగినాడు. అందులోనూ 'లోనెక్ బన్నియన్'.

'ఏమై ఉంటుందబ్బా...' అని ఆశ్చర్య పోతూ– తనకు తెలియకనే ముక్కు మీద వేలేసు కోబోయింది.

చేతులకున్న ఉల్లి ఘాటు ముక్కుకు తగిలి తుమ్ములు మొదలయ్యాయి.

భార్య తుమ్ముల్ని ఏమాత్రం పట్టించుకో కుండా ఊగి ఊగి నడుస్తూ... మిద్దె మీదకు వెళ్ళాడు బాలభాస్కర్.

'ఇంతలో అంత మార్పు' ఈయనలో ఎందు




కొచ్చిందో... పసిగట్టాలనిపించింది జయ ప్రియకు.

శుభ్రంగా సోప్ వేసి చేయి కడుక్కుని... మోకాళ్ళ నొప్పి ఉన్నా కుంటుకుంటూ మిద్దె మెట్లు ఎక్కింది.

మెల్లగా కిటికీ తలుపు తెరిచి చూసింది.

కాలు మీద కాలు వేసుకుని టింగు రంగడి లాగా రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చుని ఉన్నాడు ముద్దుల మొగుడు బాలభాస్కర్.

ఎదురుగా టీవీలో 72 వ ప్రపంచ అందాల పోటీలు రకరకాల రంగుల్లో ప్రసారమవు తున్నాయి. మిస్ వరల్డ్ 2025 విశేషాలను గుడ్లప్పగించి చూస్తూ ఉన్నాడు.

ఆ ముద్దుల మొగుడు తన నోట్లోకి 'మౌత్ ఫ్రెష్‌నర్' ని స్ప్రే చేస్తూ కనిపించాడు.

'ఆహా... ఎంత ఎరుక... కొన్న టీత్ బ్రష్‌ను ఐదేండ్లు వాడే ఈయన ఎక్కడో జరిగే అందాల పోటీలకు ఇక్కడ కూర్చుని... స్ప్రే వాడు తున్నాడు. ఖర్మ...ఖర్మ!' అనుకుంది.

'ఈ నాలుగు వారాలూ టెలివిజన్‌కే అతుక్కు పోతాడేమో... అయినా, ఈ అందాల పోటీలు మన రాష్ట్రానికి, దేశానికి ఏ లాభం తెచ్చి పెడు తాయో కానీ... పనీపాటా వదిలేసి, వాస్తవాలు మరచి, ఊహల్లో విహరింప చేస్తాయి చాలా మంది పురుష పుంగవులకు...' అని తిట్టు కుంటూ మిద్దె దిగింది జయప్రియ.





**వెళ్ళేమీ కారు పంపరు. అలాగని మనం మన సొంత వాహనంలోనో, ఏ ఓలాయో, ఊబరో అంటూ క్యాబ్‌ని బుక్ చేసుకుని వెళ్ళక్కర్లేదు. కానీ సాహిత్య సమావేశంలోనో, ఆ సభలోనో మనం అధ్యక్షుడిగానో, ముఖ్య అతిథిగానో, ప్రసంగ కర్తగానో లేదూ! వట్టి ప్రేక్షక(శ్రోతగానో - మన ఇంట్లోంచే పాల్గొనమని మనకు ఆహ్వానం వస్తుంది.**

అమ్మయ్య! తెలిసిపోయిందిగా ఇప్పటికి! కరోనా కాలపు పుణ్యమా అని, కాలు కదప కుండా సభలూ సమావేశాల్లో పాల్గొనే తృప్తి, ఆనందం అంతర్జాలంలో 'జూమ్ మీటింగ్‌లు' తీసుకువచ్చాయి.

మనం ఏ హైదరాబాద్ రవీంద్రభారతికో, త్యాగరాయగానసభకో వెడితే- అక్కడ జంట నగరాల ప్రేక్షకులే ఓ పట్టుమని పాతికమంది వుంటారు గానీ, ఈ జూమ్ మీటింగుల్లో... హైదరాబాదు, భారతదేశం ఏం ఖర్మ... అమెరికా, కెనడా, సింగపూర్ వంటి దేశ దేశాల అంతర్జాతీయ ప్రేక్షకులు కూడా జాయిన్ కావచ్చు. వందలాదిమంది చేరచ్చు. (చేరుతున్నారా అని అడక్కండి! ఈ మధ్య జూమ్ మీటింగులకు కూడా కొన్నిటికి ఓ పాతికమంది కూడా వుండడంలేదు. అవీ గుడు గుడుగుంచం మీటింగులైపోతున్నాయి! కానీ అంతర్జాతీయ ప్రేక్షకులకు అవకాశం వున్నది జూమ్ మీటింగుల్లోనే సుమా!)

పీత కష్టాలు పీతవి అన్నట్టు జూమ్ మీటిం గుల నిర్వాహకుల కష్టాలూ బోలెడున్నాయి. ముందు ఫోన్లు చేసి ముఖ్య అతిథులనూ, ప్రసంగకర్తలనూ ఫిక్స్ చేసుకోవాలి. వాళ్ళ ఫోటోలూ గ్రటాతో ఓ డిజిటల్ ఆహ్వానపత్రం రూపొందించుకోవాలి. జూమ్ లింక్ అందరికీ (ఇప్పుడు బోలెడు వాట్సప్ గ్రూపులు కదా! వాటిల్లో) షేర్ చెయ్యాలి. జాయిన్ అవడానికి ఓ పాస్‌వర్డ్ వుంటుంది. ఇప్పుడు పాల్గొనేవారి లింక్ వేరు! చూసేవారికి లింక్ వేరు కావచ్చు.




ఇంట కూర్చుని నిర్వహించుకునే సభలే అయినా, 'ఇంటర్నెట్' లేకపోతే కుదరదు!

వైఫ్ సహకారం లేకపోయినా-'వైఫై' సహ కారం మాత్రం తప్పనిసరి!

డెస్క్‌టాప్‌లో, కంప్యూటర్‌లో లేదా సెల్‌ఫోన్ లోనే సమావేశంలో పాల్గొనవచ్చు... చూడ వచ్చు. పాపం! ప్రయాణంలో వుండి కూడా కాదనలేక ఏ కారులోంచో జూమ్ మీటింగ్స్‌లో పాల్గొనే పెద్దలూ వున్నారు. అలవాటు పడ్డ ప్రాణాలు కదా సభలూ సమావేశాలకి!!

వచ్చిన చిక్కల్లా ఏమిటంటే... ఆడియో, వీడి యోల సెట్టింగ్స్‌తోనే! పాల్గొనేవారు ఆడియో మోడ్ ఆన్ చేసుకుంటేనే వారి మాట వినబడు తుంది. వీడియోమోడ్ ఆన్ చేసుకుంటేనే వారు కనపడతారు. వచ్చిన సమస్య ఏమిటంటే - వీడియో ఏంగిల్ సరిగ్గా కుదరకపోతే మాట్లాడే వారి మొహం కాక, వాళ్ళ గదిలో పై సీలింగ్ ఫ్యాన్, గోడ మీద క్యాలెండరో, వీళ్ళ తలపై భాగమో, లేకపోతే పూర్తిగా నేలయో కనపడు తుంది. లైటింగ్ సరిగా లేకపోతే మొహం కనపడుతున్నా-వారు అవునోకాదో తెలీదు! సమావేశానికి ఓ పది నిమిషాల ముందే రెడీగా అన్నీ సిద్ధం చేసుకుని వుండమని నిర్వాహకులు కోరుతారు కానీ, మొదలైన అరగంటకు కూడా కొందరు జాయిన్ కా(లే)కపోవచ్చు.

వీడియో మోడ్‌తో మనిషి కనపడుతున్నా ఒక్కసారి మాట విన్పించదు... ఆడియో ఆన్ చేసుకోరు! కొందరు ఆడియో ఆన్ చేసు కుంటారు గానీ వీడియోలో కనపడరు.

నిజానికి సమావేశంలో ప్రసంగకర్త మాట్లా డుతున్నప్పుడు - మిగతావారంతా 'మ్యూట్'లో వుండి మాట్లాడకూడదు. నిర్వాహకుడి చేతిలో కొంత 'మ్యూట్' చేసే సౌకర్యం వుంటుంది గానీ, ఆయనా నియంత్రించలేని సందర్భాలుం టాయి. అప్పుడు అసలు వక్త మాట్లాడుతుండ

గానే... ఆడియో ఆనై వుండిపోయిన కొందరి ఇంట్లో కబుర్లూ లేదూ, కుక్క అరుపులూ అసలు ప్రసంగాని కన్నా ఎక్కువగా వినిపిస్తుంటాయి.

వీడియో ఆన్ చేసుకున్నవారు కూడా... కాఫీ తాగుతోనో, లేదా భార్యతో ముచ్చట్లు పెడుతోనో కనపడే సందర్భాలుంటాయి.

జూమ్ సమావేశంలో ప్రైవసీగా పాల్గొనే అవకాశం లేకపోతే–ఇంట్లో తిరిగే పని మనిషీ, ప్రాకే పసివాడూ కూడా కనపడచ్చు.

'మీరు ఇంతసేపు మాట్లాడాలి' అని సమయ నిర్దేశం చేసినా, ఇంట్లోనే కూర్చుని వుండడం వల్ల–మామూలుగా ఏ సభావేదిక మీద నుండో కన్నా అధికంగా మాట్లాడేవారున్నారు!

సమయపాలన నిర్వహించడం ఓ సవాలే మరి!

సరే! ఇక అంతర్జాతీయ జూమ్ మీటింగుల సంగతి చెప్పక్కర్లేదు... ఏ అమెరికా నుండో ఏర్పాటైన సభ కదా అని గొప్పగా ఒప్పుకుంటే... అలవాటులేని పొద్దున్నపూటే ఇక్కడ ఇండియాలో వక్త లేవాల్సి వుంటుంది. లేదా ఏ అర్ధరాత్రి వేళో మాట్లాడాల్సి వుంటుంది. పాపం నిద్రమంచం మీంచి లేస్తూనే జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న పిసాసువులు లేకపోలేదు.

స్క్రీన్ మీద ఎవరెవరు వున్నారో కనపడుతూ వుంటుంది.


వీడియో మోడ్‌లో లేకపోతే కనపడరనుకోండి! వారి పేరో, ఫోన్ నెంబరో కనపడుతుంది. అన్నట్లు జూమ్ జరుగుతుండగానే ఛాటింగ్ చేసే వీలుంది కూడాను.

"చాలా అద్భుతంగా మాట్లాడుతున్నావ్" అని ప్రసంగకర్తకు డైరెక్ట్‌గా మెసేజ్ పెట్టచ్చు. లేదా అది అందరికీ కనపడేట్లు పెట్టచ్చు.

స్క్రీన్ షేర్ చేసుకునే వీలుతో–ఓ ఆడియో క్లిప్పింగో, ఈసరికే రికార్డు చేసిన ఓ వీడియో క్లిప్పింగో అందరికీ చూపించచ్చు. కానీ అప్‌లోడ్ చేయడంలో సరిగా లేకపోతే వెళ్ళాల్సింది పోయి మరేదో వెళ్ళిపోవచ్చు.

వందేమాతరం వేద్దామనుకుని, జనగణ మన వేసేయచ్చు!!

ఈ జూమ్ మీటింగ్‌లు అలవాటైపోయాక– ప్రయాణించి వెళ్లి సభల్లో పాల్గొనడం మానేసానన్నాడు ఒకాయన.




నిజమే కదా! బోలెడు డబ్బులు ఖర్చు పెట్టి, వాళ్ళిచ్చే ఓ దండకో, శాలువాకో అన్నేసి గంటలు ప్రయాణం చేసి వెళ్ళడం, తీరా ఆ సభలో ఏ ఆఖరునో వక్తగా వుంటే – పట్టుమని పదిమంది ప్రేక్షకులయినా లేక నిరాశపడటం ఇదంతా ఎందుకు? ఇంట్లోంచి మీటింగులో ఎంతమంది వున్నారో అనవసరం. మన టైంకి మనం మాట్లాడేసి, ఆ తర్వాత ఆడియో, వీడియో మ్యూట్‌లో పెట్టేస్తే మనం సభలో వున్నట్లే లెక్క! మనం అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయినా!

జూమ్ మీటింగ్‌లూ ఒక ప్రహసనంగా తయారయ్యే సందర్భాలూ వుంటాయి.

ఎంతమంది జాయిన్ అయ్యారు అని చూసుకుంటే...

ఏవో కొన్నింటికి తప్ప, వాటిల్లోనూ వాస్తవంగా వుంటున్నవారి సంఖ్య అనుమానాస్పదమే!

ఎటొచ్చీ ఇల్లు కదలకుండా, ఇల్లాలు–'ఇల్లు విడిచి బలాదూర్ తిరుగుతున్నారని' విసుకోక్కుండా, ఇంటిపట్టునే పట్టుమని ఓ పది నిమిషాలు పాల్గొని ప్రసంగించగల సాహిత్య సభలకు జిందాబాద్ అంటే తప్పేం వుంది!

అభిరుచి వుండాలే గానీ... ఏదయినా తప్పేదేముంది!!



# తను,ఆమె, ఒక ప్రయాణం

డాక్టర్ షహనాజ్ బతుల్, 9948491418

"సీతా! తొందరగా రా..." బయటి నుంచి అరిచాడు మాధవ.

"వస్తున్నానండి..." అంటూ వచ్చింది సీత.


సీతను కొత్త వాహనం మీద తీసుకెళ్లాలని మాధవ కోరిక.

వీళ్లకు కొత్తగా పెళ్లి అయ్యింది. భర్త హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు కాబట్టి ఇద్దరూ హైదరాబాద్‌లో కాపురం పెట్టారు.

సీత డిగ్రీ చదివింది... ఏదైనా ఉద్యోగం చేస్తాను అన్నది. ఇంటికి దగ్గరలో ఉన్న స్కూల్‌లో టీచర్‌గా చేరింది.

బయటికి రాగానే సైకిల్ని చూసింది సీత.

"ఇదేనా మీ కొత్త వాహనం?!" అడిగింది.



"సైకిల్ అని తేలిగ్గా తీసి పడేయకు. సైకిల్ మీద మనిద్దరమూ ఈ చల్ల గాలిలో ప్రయాణం చేస్తూంటే... ఎంత బాగుంటుందో... ఎక్కు!"

వెనకాల కూర్చోబోతుంటే...

"ముందు కూర్చో!" అన్నాడు.

"శ్రీమతిని సైకిల్ మీద ముందు కూర్చోబెట్టి ప్రయాణం చేస్తూంటే ఆ మజాయే వేరు."

భర్త మాటలకు ముసి ముసిగా నవ్వుకున్నది సీత.

వీళ్ల వాహనం బయలుదేరింది... కానీ సీతకు సిగ్గుగా ఉంది. విద్యార్థులు కనిపిస్తారేమోనని, తమని చూసి, నవ్వుతారేమోనని...

మాధవ పాటందుకున్నాడు–

"రింఝిమ్ రింఝిమ్ హైదరాబాద్. సైకిల్ వాల జిందాబాద్.... రెండు చక్రములు గిరగిర తిరుగుతుంటే, మోటార్ కార్ బలాదూర్...."

"ఆపండి మీ పాటలు నాకసలే సిగ్గేస్తుంటే!"

"ఎందుకు సిగ్గెందుకు?" అన్నాడు.

"ముందుకు చూసి పోనీయండి... కార్లు స్కూటర్లు వస్తున్నాయి."


"అలాగే లేవోయ్!"

"జోరుగా హుషారుగా షికారు పోదామా హాయి హాయిగా తీయ తీయగా..." అంటూ పాడుతున్నాడు.

సీతకు కొన్ని రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

✦✦✦

కొత్తగా స్కూటర్ కొన్నాడు మాధవ. ఆ రోజు మొదటిసారి ఇద్దరూ స్కూటర్ మీద బయలుదేరారు. తను మాట్లాడుతుంది. అతను వింటున్నాడు. అతను మాట్లాడుతుంటే తను వింటున్నది. అతను మాట్లాడుతూనే ఉన్నాడు.




హఠాత్తుగా తను స్కూటర్ మీద నుండి, చిన్నగుంటలో పడిపోయింది. చాలాసేపు అలా ఉండి పోయింది. భర్త ఇంకొంచెం ముందుకు వెళ్ళి, తను వెనకాల లేదని గమనించి, వెనక్కి వచ్చి చూస్తే, తను గుంటలో పడిపోయి ఉంది.

అదృష్టవశాత్తూ చిన్న గాయాలే తగిలాయి. ఆసుపత్రికి తీసుకెళ్ళి, కట్టు కట్టించి తీసుకొచ్చాడు. ఆ తర్వాత మళ్లీ ఆ స్కూటర్ జోలికి వెళ్ళలేదు.

ఆ తర్వాత భర్తతో ఒక వాహనము మీద వచ్చింది ఇప్పుడే. అతనికి తనంటే చాలా ప్రేమ. అతి ప్రేమను తట్టుకోవడం కష్టం.

"దేవుడా మళ్లీ అటువంటి ప్రమాదం జరుగకుండా చూడు. ఇన్ని పెద్ద పెద్ద వాహనములు వెళుతున్నాయి."

డొక్కు సైకిల్ ఒకటి తీసుకువచ్చారు. అందులోనూ రద్దీ రోడ్లలో ప్రయాణము చేస్తున్నారు. తనకేమో భయం భయంగా ఉంది. అతనికేమో గాలిలో తేలిపోయినట్లుంది. హుషారుగా పాటలు పాడుతూ వెళుతున్నాడు.

ఒక ఆటో ప్రక్క నుండి వెళ్ళిపోయింది. కొద్దిలో ప్రమాదం తప్పింది.

"ఏయ్ ఇంత ట్రాఫిక్‌లో సైకిల్ వేసుకొచ్చావ్ బ్రతకాలని లేదా జాగ్రత్త!" అని వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు.


అదేమీ లెక్క చేయకుండా నడుపుతున్నాడు.

దబ్బున శబ్దమైంది... ఒక కారు సైకిల్‌ని గుద్దేసి, ముందుకు వెళ్ళిపోయింది. ఇద్దరూ క్రింద పడ్డారు. దెబ్బలేమి తగల్లేదు.

"మీకూ మీ సైకిల్‌కీ ఓ దణ్ణం. ఇంకెప్పుడూ ఈ డొక్కు సైకిల్ వద్దు... ఎప్పుడైనా బయటికి వెళ్ళాలంటే హాయిగా ఆటోలో వెళదాం..." అన్నది.

అక్కడ్నుంచి ఎలాగో ఇంటికి చేరారు.

ఆటోవాడు కూడా బ్రతకాలి కదా!.. లేక ఉండనే ఉన్నది. ఆర్.టి.సి.బస్సు జిందాబాద్ అనుకున్నది. ఆ తర్వాత సొంత వాహన యోగం కలుగలేదు.




# నెల నెలా నవ్వుల వెన్నెల





**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం మీద** హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- టీ


నిర్వహణ: **లాల్**


























ఎక్కువ పనిచేసినందుకు రావాల్సిన OT అలవెన్స్
అడిగితే...వో "టీ" ఇచ్చి పంపాడోయ్...
మేనేజర్


క్షమించండి..
నేనొక స్ట్రాంగ్ 'టీ'తాగితే తప్ప..
మీతోటి నిజం చెప్పలేను.
జడ్జ్
మంత్రి



ఆఁయ్!!
ఇదేవిటీ?
మనం తాగేదేనే!
బ్లాక్ బాండు!


ఇంకో టీ కావాలా..!?
చిటికెలో వస్తుంది చూడు.....→
"మై డియర్ పెనిమి-'టీ'..!!
ఎవరు నీకు సా-టీ!?
నువ్వేగా నా సెలబె-టీ!!
వద్దులే మనకు ఎనిమి-టీ!!"
హు..! ఈ ఇండైరెక్టు సెటైరికేం తక్కువ లేదు..!
పరోక్షభాషిణి
కవయిత్రి


టీ తో మరీ వేడిగా ఉంది చూసి తాగండి
సార్


నీ మీద ప్రేమతో నీకోసం
ఈ టీ చేశాను. రుచి చూసి
ఎలా ఉందో చెప్పు


ఆయనగారు టి ఇలాగే తాగుతారు



మాతో పాటు మా చంటోడికి 'టీ'
ఇవ్వవ వదినా..లేకపోతే రచ్చ రచ్చే..!
ఏం తీసుకుంటారు?

# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## నేటి ప్రేమాభిషకం

**ఈ రోజుల్లో ప్రేమలోనూ పెళ్లిలోనూ మోసం, దగా, స్వార్థం ఇత్యాదులు నిక్షిప్తమై వున్నాయని అనడంలో సందేహం వలదు..అందుచేత నేటి మనుజులు ప్రతి అడుగు ఆచి తూచి వేయాల్సిన పరిస్థితి ప్రస్తుత సమాజంలో నెలకొంది. ఈ డైలాగ్ ఎందుకు కూశానో దిగువున వున్న ఉదంతాన్ని చదివితే మీకే తెలుస్తుంది.**




ట్వంటీ ఫైవ్ వయసుకు రీచ్ అయిన రాజేష్ వాళ్ళ పేరంట్స్‌కి ఏకైక సంతానం. వేల కోట్ల ఆస్తికి వారసుడు.

ఓ శుభసందర్భంలో శ్రీదేవి అనే మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చెందిన ఓ అందాల అమ్మాయిని చూసీ చూడగానే ఇమ్మీడియట్ ఇష్క్‌లో పడిపోయాడు. శ్రీదేవి విమానాలలో ప్రయాణికుల అవసరాలు, సౌకర్యాలు చూసుకునే మహిళా ఉద్యోగి... అనగా ఎయిర్ హోస్టెస్.

కొన్నాళ్ళు శ్రీదేవి వెంట తిరిగాక ఆమెను ప్రేమిస్తున్నట్టు ఆమెతో చెప్పేశాడు రాజేష్.

సగటు భారతీయ అమ్మాయిగా మొదటైతే 'నో' చెప్పింది. అయినా శ్రీదేవి ఎక్కడికెళ్ళినా అక్కడికి పోయి సైట్ కొట్టేవాడు. దాంతో శ్రీదేవి మనసు వెనీలా ఐస్‌క్రీంలా కరిగిపోయి రాజేష్ ప్రేమని సాదరంగా యాక్సెప్ట్ చేసింది. తను ఎంతగానో ప్రేమించే శ్రీదేవి తన ప్రేమని ఒప్పుకోవడంతో తన సంతోషం సముద్రంలో సునామీలా చెలరేగిపోయింది.

ఆ రోజు లగాయతు రాజేష్, శ్రీదేవి పార్కులకు, సినిమాలకు అప్పుడప్పుడూ పబ్బులకు వెళ్ళడం అనేది తమ దైనందిన కార్యక్రమంగా పెట్టుకున్నారు.

వీళ్ళ ప్రేమ దిన దిన ప్రవర్ధమానం చెందుతుండగా ఓ అన్‌ప్రిడిక్టబుల్ ఇన్సిడెంట్ ఎంటర్ అయింది.

రాజేష్‌కు క్యాన్సర్ అనీ అది కూడా చాలా అభివృద్ధి దశలో ఉందనీ మహా అయితే థర్టీ ఫోర్ డేస్ కంటే ఎక్కువ రోజులు బతికి బట్ట కట్టే చాన్సస్ లేవని కార్పోరేట్ డాక్టర్స్ కాన్ఫిడెంట్‌గా తేల్చి చెప్పారు.

తనని ఎంతగానో ప్రేమించిన, ప్రేమిస్తున్న శ్రీదేవికి ఈ దుర్వార్త తెలిస్తే తట్టుకోలేదని రాజేష్ భావించి, తను శ్రీదేవి దృష్టిలో చెడ్డ వాడుగా క్రియేట్ అయితే... తనను ద్వేషించి దూరం అవుతుందని డిసైడ్ చేసుకుంటాడు.

అనుకున్నదే తడువుగా యాక్షన్ ప్లాన్‌లోకి దిగిపోయాడు రాజేష్.

శ్రీదేవికి సిగరెట్లు తాగే వాళ్ళంటే నచ్చదు. అందుకని శ్రీదేవి ముందే సిగరెట్లు గబగబా తాగి పడేస్తున్నాడు.

"నీకు... సిగరెట్లు తాగే అలవాటు లేదు కదా... మరెందుకు ఇలా తాగుతున్నావ్?" అని శ్రీదేవి అడిగింది.

"నాకు సిగరెట్లు తాగే అలవాటు లేదని నీకు చెప్పానా? రోజుకు ఎనభై తాగుతాను. తాగద్దని నాకు పిచ్చి పిచ్చి సలహాలు ఇవ్వకు!..." అన్నాడు సిగరెట్ పొగ వదులుతూ

"నీకు అలవాటు వుందా అని మాత్రమే అడిగాను... అంతేగానీ, తాగద్దని నేనెందుకంటాను? నీ డబ్బులూ నీ ఇష్టం!" అని అంది.

"ఇప్పుడే వస్తా..." అని అక్కడి నుండి వెళ్లి వైన్‌షాప్‌లో చీపు లిక్కర్ బాటిల్ కొనుక్కొని మళ్ళీ శ్రీదేవి వున్న చోటుకు వచ్చాడు.

"మీరిలా రోడ్ మీద తాగడం ఎవరైనా చూస్తే బావుండదు.పద...మా ఇంటికి వెళ్దాం" అని అంది శ్రీదేవి.

"వద్దు... ఇలా తాగుతూ రోడ్ మీద వెళ్ళే ఆంటీలని చూస్తే యమ రంజుగా వుంటుంది." అన్నాడు ఓ ఆంటీ వైపే చూస్తూ.

" ఏంటీ రాజేష్! ఇదివరకు ఎప్పుడూ నీ బిహేవియర్ ఇలా వుండేది కాదు. ఇప్పుడెందుకిలా ప్రవర్తిస్తున్నావ్ ?" అంది శ్రీదేవి.

"అప్పుడు నిన్ను ప్రేమలో పడేయడానికి బుద్ధిమంతుండిలా నటించాను... ఇప్పుడు ఆ అవసరం లేదు కాబట్టి నా ట్రూ కలర్స్ బయట పెట్టుకుంటున్నా!" అని తాగిన బాటిల్‌ని రోడ్ మీదకి విసిరేశాడు.

రాజేష్‌ని ఆ లొకేషన్ నుండి తీసుకుని వెళ్ళే ఉద్దేశంతో– " రాజేష్ ! ఆకలిగా వుంది. పద. ఏదైనా హోటల్‌కు వెళ్లి టిఫిన్ తిందాం" అంది.

"నాకు ఆకలిగా లేదు! కావాలంటే నువ్వెళ్ళి దొబ్బి తినుపో!" అని అన్నాడు రాజేష్ .

"ఓకే రాజేష్! ఈ రోజెందుకో నీ మూడ్

బాగా లేనట్టుంది. రేపు కలుస్తాను" అని వెళ్ళి పోయింది శ్రీదేవి.

ఎంతగానో ప్రేమించే శ్రీదేవితో వరస్టుగా బిహేవ్ చేసినందుకు రాజేష్ చాలా బాధ పడుతూ– "ఏయ్ భగవాన్ ! నాకే ఎందుకు ఇంత శిక్ష విధించావ్? నేను ఎవరికి ద్రోహం చేశాను ?" అని పొదల చాటుకు వెళ్లి లబలబా ఏడుస్తూ కూర్చున్నాడు.

✦✦✦

జయంతి అనే వేశ్యను రాజేష్ కల్సి ఆమెతో తన క్యాన్సర్ గురించీ, శ్రీదేవితో తనకున్న ప్యార్ గురించి చెప్పి– "కొన్నాళ్ళు నువ్వు నా లవర్‌గా నటించాలి. దానికి ప్రతిఫలంగా నీకు చెల్లించుకుంటాను" అన్నాడు.

రాజేష్ ప్రపోజల్‌కు జయంతి థమ్స్ అప్‌ని చూపెట్టింది.


జయంతితో వుండగా అక్కడికి శ్రీదేవిని రమ్మని చెప్పాడు రాజేష్. శ్రీదేవి వెంటనే అక్కడికి వచ్చింది.

"ఏయ్ దేవీ! నీతో పాటు ఈ జయంతిని కూడా ప్రేమిస్తున్నాను. కొన్నాళ్ళ తర్వాత మీ ఇద్దర్లో నాకు ఎవరు నచ్చితే వాళ్ళని పెళ్లి చేసుకుంటా... ఈ డీల్ నీకు ఓకేనా డార్లింగ్?" అని అన్నాడు.

" ఛీ!... నీ గురించి నేను ఎంత గొప్పగానో ఊహించుకున్నాను. కానీ ఇలాంటి వాడివి అనుకోలేదు. నీకూ నీ ప్రేమకు గుడ్ బై" అని వెళ్లబోతుంటే...

"ఏయ్ దేవీ డార్లింగ్! ఇన్నాళ్ళూ నువ్వు నాతో విచ్చలవిడిగా తిరిగావ్! అంతేకాకుండా సోషల్ మీడియాలో మనమిద్దరం లవర్స్‌లాగా చేసిన రీల్స్ వున్నాయి, సిగ్గూ ఎగ్గూ లేకుండా బరితెగించి మనం తీయించుకున్న ఫోటోలు దండిగా సర్కులేట్ అయ్యాయి... వాటిని ప్రతి ఒక్కరూ ఇప్పటికే చూసేసి ఉంటారు. దట్స్ వై ఇక నిన్ను ఎవడూ పెళ్లి చేసుకోడు..." అని జయంతిని ముద్దుపెట్టుకుని–"నేను జయంతిని పెళ్లి చేసుకుంటా! నువ్వు నాకు సెకండ్ సెటప్‌లా వుండి పోరాదూ?" అన్నాడు రాజేష్.

వెళ్తున్న శ్రీదేవి ఆగి ఆవేశంగా– "ఏయ్! మిస్టర్! అలాంటి ఆశలేమీ పెట్టుకోకు. మా కాలనీలో ప్రసాద్ అనే వాడొకడున్నాడు. వాడు




నన్ను ఆరోతరగతి నుండి ప్రేమిస్తున్నాడు. నేను ఎలాంటి దాన్నైనా నన్ను పెళ్లి చేసుకునే రకం! రేపు ఎర్లీ మార్నింగ్ టెన్ థర్టీకల్లా వాడినే పెళ్లి చేసుకుని వచ్చి నీకు కనిపిస్తాను!చూస్తుండు!" అని ఆవేశంగా వెళ్ళి పోయింది.

తన అనుచిత వ్యాఖ్యలతో శ్రీదేవిని హర్టు చేసినందుకు రాజేష్ పొగిలి పొగిలి ఏడుస్తుంటే జయంతి కన్సోల్ చేసింది. ఆ దరిమిలా ఆమె ఒళ్లో పడుకుని సేద తీరుతూ నిద్రలోకి జారు కున్నాడు.

నిద్ర లేచిన రాజేష్‌తో– "ఏమండీ! నేను వేశ్య అయిన కారణంగా నన్ను ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదు. పెళ్ళీ పెటాకులు లేని వనితగా చనిపోవడం నాకు ఏమాత్రం ఇష్టం లేదు. చనిపోయేలోగా ఒక్క క్షణమైన ఒకరికి భార్యననిపించుకుని చచ్చిపోవాలని వుంది... ఎలాగూ మీరు కొన్నాళ్లల్లో తుదిశ్వాస విడుస్తారు కాబట్టి ఈ జన్మలో మీ భార్యగా చనిపోయే మహద్భాగ్యాన్ని నాకు కల్పించండి!" అని అభ్యర్థిస్తూ వేడుకుంది.

'పిచ్చిదానా... నువ్వూ నీ సెంటిమెంట్సూ' అనుకుంటూ అదోలా నవ్వుతూ 'తాళి ఎక్కడ?' అన్నట్టు సంజ్ఞ చేశాడు.

పరుగున వెళ్ళీ ఫ్రిడ్జ్‌లో దాచిన తాళి బొట్టుని తీసుకొచ్చి రాజేష్‌కు ఇచ్చింది జయంతి.

ఆమె మెడలో తాళి కట్టాడు రాజేష్. పట్టలేని సంతోషంతో రాజేష్ కాళ్ళకు నమస్కరించి... ఆనందభాష్పాలు టపటపా రాల్చింది జయంతి.

రాజేష్ వాటిని తుడుస్తూ– "జయంతీ!... ఇప్పుడు నువ్వు నా భార్యవి! వైఫాఫ్ గంగి గోవుల రాజేష్!" అని కౌగలించుకున్నాడు.

✦✦✦

జయంతిని పెళ్లి చేసుకున్న రాజేష్ రెండు రోజుల తర్వాత ఈ పాడు లోకాన్ని వదిలి వెళ్ళిపోయాడు.

రాజేష్ దశదిన కర్మ తర్వాత రాజేష్ పేరెంట్స్‌కు జయంతి నుండి లాయర్ నోటీస్ వచ్చింది.

రాజేష్ భార్యగా... తనకి ఆస్తిలో హక్కు వుందనీ అంచేత తనకి చట్టపరంగా రావాల్సిన వాటా ఇవ్వాలని కోరడమే కాకుండా తనకి రాజేష్ తో పెళ్లి అయినట్టుగా తాళి కడుతున్న వీడియో ఫుటేజీని కూడా పంపించింది.

పెళ్లి అయినట్టుగా ఎవిడెన్స్ పకడ్బందీగా వుండడమే కాకుండా రాజేష్ కేవలం క్యాన్సర్ వల్లే చనిపోయాడనీ... ఆయన మరణంలో ఎలాంటీ కుట్రకోణం లేదని తేలింది. దాంతో రాజేష్ పేరెంట్స్ జయంతికి ఐదువందల కోట్లు మాత్రం ఇచ్చి మ్యూచువల్ సెటిల్‌మెంట్ చేసు కున్నారు.

జయంతి ప్రాస్టిట్యూట్ అయినప్పటికీ... ఆమెను పెళ్లి చేసుకోడానికి ఇప్పుడు వందల మంది ఆదర్శ యువకులు ముందుకు వచ్చారు. వాళ్ళలో ఎవరిని చేసుకోవాలో ఆలోచనలో పడింది మిలియనీర్ అయిన జయంతి మేడం గారు.

(ప్రేమాభిషేకం చిత్ర నిర్మాత, దర్శకులకు క్షమాపణలతో...)

# దొందూ దొందే!

సుస్మితా రమణమూర్తి, 9703440214

**"ఆ పాత పాటల మైకంలోంచి బయటకు రండి శ్రీవారూ! వాటిని ఎప్పుడైనా వినవచ్చు"**


**వారు అలనాటి ఘంటసాల వారి పౌరాణిక పద్యాలు కళ్ళు మూసుకుని చరవాణిలో వింటున్నారు.**

**"ఏఁవండోయ్! ఈ కిటికీ గట్టుపై తాళంకప్ప, చెయిను పెట్టాను. మీరేమైనా చూసారా?"**

శ్రీమతి ఆరుపుకి కళ్ళు తెరిచారు వారు. మరల ఆమె వాటి గురించి అడిగింది.

"వాటిని డ్రెస్సింగు టేబులు సొరుగులో ఉంచాను."

"అనుకున్నాను... మీరే జాగ్రత్తగా పెట్టి ఉంటారని. అవి మనవి కాదండీ! కిందటి నెల అనకాపల్లిలోని మా బంధువుల అమ్మాయి పెళ్ళికి వెళ్ళాం కదా?.. అప్పుడు వారు రైలులో సూట్ కేసుకి వేస్తే సేఫ్టీ అని...



ఆ తాళంకప్ప చెయిను ఇచ్చారండీ!"

"మరి తిరిగి ఇవ్వడం ఎలా?" భర్త ప్రశ్నకు నవ్వుతూ చెప్పింది ఆమె...

"ఆ నూతన దంపతులు తిరుపతి వెళ్తారట. తిరుగు ప్రయాణంలో మన ఇంటికి వస్తారట. అప్పుడు ఇచ్చేయొచ్చు. ఓసారి మనం నూకాలమ్మ తల్లి మొక్కు తీర్చుకోడానికి వెళ్ళినప్పుడు వారింటికి వెళ్ళాం గుర్తుందాండీ?..."

సమాధానం లేకపోవడంతో... భర్త మతి మరుపుకి విసుక్కుంది ఆమె.

అన్ని బాధ్యతలు తీరి, రామాకృష్ణా అనుకునే దశలోని దంపతులు వాళ్ళు.

జజజజజజ

"తాతా! ఈ బల్లపై నా ప్రాజెక్టు వర్కు కాగితాలు పెట్టాను. నీవేమైనా తీసావా?"

"ఉదయం ఎక్కడో చూసినట్లే గుర్తురా!"

"మీ తాతకి పనీ పాటు ఉండదు. పొద్దున్నే లేచి అన్నీ సర్దడం బాగా అలవాటై పోయింది. ఏ వస్తువూ పెట్టిన చోట ఉంచరు. ప్రాజెక్టు కాగితాలు స్కూలు బేగులో పెట్టుకోక పోవడం నీదే తప్పు!''

తల్లి మందలింపుకి కూతురు తాతవేపు కోపంగా చూసింది . వారు మాత్రం ఆ కాగితాలు స్కూలు బేగులో పెట్టిన విషయం మరచిపోయారు.

✦✦✦

"ఏఁవిటండీ!... అలా వెతుకుతున్నారు?.. ఉదయం నుంచీ చూస్తున్నాను. వెతికిన చోటే అలా వెతుకుతున్నారు!..."

చిరాగ్గా విషయం చెప్పారు...

"అదేనే!... అనకాపల్లి వారు రెండ్రోజుల్లో వస్తున్నారు కదా? వారి తాళంకప్ప, చెయిను ఈ సొరుగులోనే పెట్టాను... అన్ని సొరుగులు చూసాను. ఎక్కడా లేదు!"

విషయం విన్న ఆమె రుసరుస లాడింది.

"అన్నీ మీకే కావాలి... పెట్టిన చోట ఏదీ ఉంచరుగా?... వచ్చినప్పుడు వాటిని వారికి ఇవ్వకపోతే ఏం బాగుంటుంది చెప్పండి?"

"అదే ఆలోచిస్తున్నాను... మరోమారు వెదుకుతాను!"

"సరే! కనిపిస్తే నాకు ఇవ్వండి... మరల ఎక్కడో పెట్టేయకండి!"

"అలాగే! అలాగే!! ఇక మీదట ఏదీ ముట్టుకోనులే!..." కోపంగా అన్నారు వారు.

ఆమె ఇంకా ఏదో అనబోతుంటే...

వారు తీవ్ర స్వరంతో చెప్పారు– "కనిపిస్తే వారికి ఇస్తాం. లేకుంటే ఎవరైనా వస్తే, వారితో పంపిద్దాం! అదీ కాకుంటే కొరియర్ ద్వారా పంపుదాం!"

✦✦✦

"ఏంటిసారూ! హాలంతా సిందరొందరగా ఉంది. పెనిసిల్లు, పెన్నులు, పుస్తకాలు ఏడబడితే ఆడే నేలపై పడున్నాయి!" తెల్లారే వచ్చిన పనిమనిషి అడిగింది తాతగారిని.

"తను పట్టించుకోకుంటే ఇలాగే ఉంటుంది ఇల్లు" స్వగతంలా అనుకుంది పనిమనిషి.

"సర్లే! పిల్లలున్న ఇల్లు ఇలానే ఉంటుంది. ముందు వాకిలి తుడిచి ముగ్గు పెట్టు. ఈలోగా అన్నీ సర్దుతాను!"

✦✦✦

మనవడు ఆట వస్తువులతో హాలులో ఆడుకుంటున్నాడు... ఆ వస్తువుల్లో తాళం కప్ప, చెయిను చూసిన తాతగారు... "ఇది నీ పనట్రా?" అంటూ ఆశ్చర్యపోయారు.

"ఏఁవండోయ్ శ్రీమతిగారూ! ఇదిగో తాళం కప్ప, చెయిను!" అంటూ ఆమెకు ఇచ్చారు.

"వాళ్ళు తిరుపతి నుంచి వచ్చిన తర్వాత... ఇవ్వొచ్చు. మీరే జాగ్రత్త చేయండి!" అందామె.

"ఆ పని నీవే చేయు!" అన్నారు వారు.

✦✦✦

"శ్రీవారు బీరువాలో బట్టలన్నీ దులిపి మరీ వెతుకున్నారు దేనికోసమో?"


"రేపు మనం హాస్పిటలుకి వెళ్ళాలి కదా?... హెల్త్‌కార్డులు కనిపించటం లేదు!" వెదుకుతూనే చెప్పారు.

"ఇందాకట్నుంచి చూస్తున్నాను. నీవు కూడా దేని కోసమో వెదుకుతున్నావు కదా?"

"అదేనండీ!... ఆ తాళంకప్ప, చెయిను ఎక్కడ పెట్టానో గుర్తు లేదండీ!"

ఇద్దరి వెదుకులాట చూసిన కూతురు నవ్వుకుంటూ... 'దొందూ దొందే!' అనుకుంది.





# పదానందం-23



కూర్పు: **పోపూరి విశ్వనాథ్, 9133197111**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | | 4 |
| | | | | | | | |
| 5 | 6 | | 7 | | 8 | | |
| | | | 9 | | | | |
| 10 | | | | | 11 | | 12 |
| | | | 13 | | | | |
| 14 | 15 | | | | | 16 | |
| | | | | 17 | | | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. వీటిని వినకూడదంటారు (6)
5. అటునుంచి ఆపకుండా చెప్పడం (4)
8. నీటిలోనూ, నేలమీదా కనిపించే జంతువు (3)
9. దవనం లాంటిది సరిగా లేదు (3)
10. ముగ్గురికంటె ఎక్కువ, ఐదుగురికంటే తక్కువ (4)
11. మెట్ట కాదు (3)
13. ఏడాదిలెక్కకు పనిచేసే సేద్యగాడు (3)
14. తత్తరపాటు, తికమక (4)
16. తాటిటెంక నుంచి వచ్చే మొలక (2)
17. చెవులపిల్లి (3)

**నిలువు**

1. చెరపకురా...... అని సామెత (3)
2. పొట్ట సరిగాలేదు (3)
3. పైకి తేరుకున్నది పైకే వచ్చింది (2)
4. భయం, అధైర్యం (3)
6. చేతిగుడ్డ (3)
7. పరాకు (5)
8. అటూఇటూ అవడం (4)
10. ప్రవర్తన (3)
12. లెక్కలశాస్త్రం సరిగాలేదు (3)
15. దీనికి లోకం దాసోహం అంటారు (2)
16. కుడుతుంది జాగ్రత్త (2)

**సమాధానం వచ్చే సంచికలో**

### పదానందం-22 సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 వి | ప | 2 రీ | తం | | | 3 క | సి |
| కృ | | క్షి | | 4 మ | ర్యా | ద | |
| 5 తి | ధ్ధ | ప | | న | | లి | |
| | | 6 త్తు | 7 ప | వి | | 8 క | 9 ల |
| 10 తొ | 11 న | | క | | 12 పా | | క్ష |
| | ల | | 13 ప | ర | ధ్యా | నం | |
| 14 తి | క | 15 మ | క | | యి | | 16 వె |
| క్క | | లి | | 17 వి | డు | ద | ల |

తెలుగులో వెలువడుతున్న
ఏకైక హాస్య మాస పత్రిక
హాస్యానందం
చందాదారులుగా చేరండి!
నవ్వే లక్షణం మీ సొంతం చేసుకోండి!!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P




**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548

Hasyanandam August-2025 RNI No. APTEL 08387/01/1/2003-TC

Estd.1965

ISO 9001:2015 NAAC 'A++' GRADE CYCLE 4

# KAKARAPARTI BHAVANARAYANA COLLEGE

(Sponsored by S.K.P.V.V. Hindu High Schools' Committee), (AUTONOMOUS)

Kothapeta, Vijayawada - 520 001. Contact: 9182907747

SKPVV INSTITUTIONS
Educating the Community since 1907

# Firtst Choice

## For Bright future @ KBN Colllege

DIAMOND JUBILEE CELEBRATIONS 1964-2024 60 Years KBN COLLEGE NAAC A++ | UGC CPE

A++ GRADE CGPA 3.53 ACCREDITED BY NAAC

## OUR ACHIEVEMENTS



JEE Mains 2025
B.Yeswanth Sai, Sr. MPC
got 99.95 Percentile



NEET
N.Pavani Swetha, Sr. BiPC
got 96.95 Percentile



IPE M. Harshini,
Sr. CSE got 988



IPE D. Bhoomika,
Sr. CSE got 988



A.Jyothi Mallika of
(MSCS) received
Rs. 1,00,000 award under
Community Service Project



Sk. Dunisha, (BBA)
received a Rs. 2,00,000
grant under the
Niti Aayog Scheme



P.Bharat Kumar
International Award
in Power Lifting



B.Satya
Received Andhra Pradesh
State Best Sports woman
Award -2025

## Our Recruiters

90% Placements for the year 24-25

Google, WIPRO, TATA CONSULTANCY SERVICES, Tech Mahindra, L&T, Mahindra Satyam, Infosys, BYJU'S, GENPACT, accenture High performance. Delivered., AXIS BANK, ASTRIN AVIATION, SBI